ఈనాడు ప్రకాశం
ఆదివారం 29 సెప్టెంబరు 2024 5

# సాహసికుల స్వర్గం

▶ జీవ వైవిధ్యానికి నెలవు ▶ ఆధ్యాతికతకు ఆదరవు


నల్లమల విశేషాలను విద్యార్థులకు వివరిస్తున్న అటవీ శాఖ సిబ్బంది

నల్లమల.. ప్రకృతి అందాలకు పుట్టినిల్లు. ఆకాశాన్ని తాకే ఎత్తైన కొండలు, పాతాళంలోకి ఉన్నాయా అనిపించే లోయలు.. అనేక రకాల వృక్షాలు, జంతువులతో ఉండే ఈ ప్రాంతం సాహసికులకు ఓ స్వర్గధామం. పక్షుల కిలకిలరావాలు, సాయం సంధ్యవేళల్లో భానుడి కిరణాలు, సూర్యాస్తమయ సౌందర్యాలు, జడివానలో అవనీత అందాలు.. పచ్చని చెట్ల మధ్య ప్రయాణాలు.. కొండల నుంచి జాలువారే జలపాతాలు.. ఇవన్నీ సాహసికులను కట్టిపడేస్తుంటాయి. ఇటు ఆహ్లాదంతో పాటు అటు ఆధ్యాత్మిక వాతావరణమూ వనంలో విరాజిల్లుతోంది. ద్వాదశ జ్యోతిర్లింగాల్లో ఒకటైన శ్రీశైలం నల్లమల సిగనే ఉంది. శ్రీశైల మల్లన్న దర్శనం కోసం వెళ్లే భక్తులకు ఆహ్లాదకరమైన వాతావరణంతో పెద్దదోర్నాల-శ్రీశైలం నల్లమల రహదారి నిత్యం స్వాగతం పలుకుతుంటుంది. సాహసికులను ఆకర్షించడంతో పాటు వారికి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు అటవీశాఖ కృషి చేస్తోంది. నల్లమల విశిష్టతను ఇక్కడి విజ్ఞాన కేంద్రం వివరిస్తుంది. పులి, చిరుత ఇతర వన్యప్రాణులు, పక్షులు, జలచరాలను తెరపై చూపుతూ అటవీ సిబ్బంది వివరిస్తారు. నల్లమల లోతట్టు ప్రాంతంలో జీపీపై సాగే ప్రయాణంతో అందరికీ ఓ మరపురాని అనుభూతిని మిగిలిస్తుంది.

- న్యూస్‌టుడే, గిద్దలూరు పట్టణం, పెద్దదోర్నాల


నల్లమల సహజ అందాలను జీప్సీలో తిరుగుతూ వీక్షిస్తున్న పర్యటకులు



▶ విస్తీర్ణం: సుమారు **3.60 లక్షల హెక్టార్లు** (మార్కాపురం, గిద్దలూరు టైగర్ రిజర్వ్ డివిజన్ల పరిధి)

▶ అభయారణ్యాలు...: **గుండ్లబ్రహ్మేశ్వర, రాజీవ్ గాంధీ**

▶ అరణ్యంలోని జంతుజాలం...:

**పులులు: 87** (నాగార్జున సాగర్, శ్రీశైలం టైగర్ రిజ్వర్ పరిధిలో 2024 గణన ప్రకారం)



**చిరుతలు: 348** (అటవీ అధికారుల లెక్కల మేరకు ఒక్కో పులికి 4 చిరుతలుండే అవకాశం ఉంది.)




తుమ్మలబైలు జంగిల్ సఫారీ ముఖద్వారం

● ఎలుగుబంట్లు మనుబోతులు, చుక్కల దుప్పులు, జింకలు, కడితిలు, కొండగొర్రెలు, ముళ్లపందులు, అలుగులు, అడవి పందులు, అడవిదున్నలు(గార్), నెమళ్లు, మూసిక జింకలు, పునుగు పిల్లులు వంటి అనేక జంతువులు ఉన్నాయి. వందలాది ఆయుర్వేద మొక్కలకూ నల్లమల నెలవు.

● గిద్దలూరు - నంద్యాల రైలు మార్గంలో 1,549 మీటర్ల పొడవైన కొండ గుహల నుంచి సాగే రైలు ప్రయాణం ఎప్పటికీ గుర్తుండి పోతుంది.

● నెమలిగుండ్ల రంగనాయకస్వామి, అర్ధవీడు మండలం మద్దిపెంట అటవీప్రాంతంలోని జలపాతాలు వర్షాకాలంలో కనువిందు చేస్తుంటాయి. ● నల్లమల అటవీప్రాంతంలోని ఇష్టకామేశ్వరి దేవాలయం, తుమ్మలబైలు ఎకో టూరిజం ఎంతగానో ఆకట్టుకుంటాయి.

● **జీప్సీల్లో విహారం.. అడవిలో ప్రయాణం...:** పెద్దదోర్నాల- శ్రీశైలం నల్లమల రహదారిలో నిత్యం వేలాది మంది భక్తులు, పర్యటకులు రాకపోకలు సాగిస్తుంటారు. శని, ఆది, సోమవారాల్లో రోజుకు వెయ్యికి పైగా వాహనాల్లో ఇరవై అయిదు వేల మంది వరకు ప్రయాణిస్తుంటారని అంచనా. వీరిలో వెయ్యి మందికి పైగా జంగిల్ సఫారీని సందర్శిస్తుంటారు. రెండు వందల మంది జీప్సీల్లో విహరిస్తూ అటవీ అందాలను వీక్షిస్తుంటారు. మంగళవారం నుంచి శుక్రవారం వరకు రోజుకు అయిదు వందలకు పైగా వాహనాల్లో పది వేల మంది ప్రయాణిస్తుంటారు. వీరిలో అయిదు వందల మంది జంగిల్ సఫారీని సందర్శిస్తుంటారు. వంద మంది వరకు జీప్సీల్లో అడవిని తిలకిస్తుంటారు.







## పర్యావరణ హితం.. యాత్ర అభిమతం



ప్రభు అనే యువకుడిది రాజస్థాన్ రాష్ట్రం రాజసముందర్ ప్రాంతం. ఆధ్యాత్మిక గీతాలు ఆలపిస్తూ వాటిని సామాజిక మాధ్యమాల్లో ఉంచుతూ అక్కడి వాసులకు చేరువయ్యారు. సొంత రాష్ట్రంలోని ఎడారీకరణ పరిస్థితులు అతన్ని కలచి వేశాయి. చెట్ల నరికివేత.. భూతాపం విపరీతంగా పెరగడం వంటి అంశాలు ఆలోచింపజేశాయి. పర్యావరణంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు తనవంతు ప్రయత్నం చేయాలని సైకిల్ యాత్ర చేపట్టారు. ప్రతి ఒక్కరు మొక్కలు తప్పక నాటి సంరక్షించాలని... ఆడపిల్లలను చదివించాలనే సందేశంతో ఆగస్టు 5న రాజస్థాన్ రాష్ట్రంలో ఉదయ్‌పూర్ నుంచి సైకిల్ యాత్ర ప్రారంభించారు. గత 61 రోజులుగా.. వివిధ రాష్ట్రాల మీదుగా పర్యటిస్తూ శనివారం ఒంగోలు చేరారు.

– ఈనాడు, ఒంగోలు

## ఉదయం 5 గంటల నుంచే పింఛన్లు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: వచ్చే నెల 1న ఉదయం 5 గంటల నుంచే ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ ప్రక్రియను ప్రారంభించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. పింఛన్ల పంపిణీపై జిల్లాలోని అధికారులతో శనివారం వీక్షణ సమావేశం నిర్వహించారు. అక్టోబర్ 2న గాంధీ జయంతిని పురస్కరించుకుని సెలవు దినం కావడంతో 1నే పంపిణీ పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

## నిత్యం నడకతో గుండె పదిలం


ప్రదర్శనలో గాలి బుడగలు ఎగుర వేస్తున్న ఎస్పీ దామోదర్, వైద్యాధికారులు, వైద్య విద్యార్థులు

రోజూ క్రమం తప్పకుండా ముప్పై నిమిషాలపాటు నడవడాన్ని అలవాటుగా మార్చుకుంటే గుండె ఆరోగ్యం పదిలంగా ఉంటుందని ఎస్పీ దామోదర్ అన్నారు. ప్రపంచ హృదయ దినోత్సవాన్ని పురస్కరించుకుని కిమ్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఒంగోలులో మూడు కిలోమీటర్ల నడక కార్యక్రమాన్ని శనివారం చేపట్టారు. ఆసుపత్రి గుండె వైద్యనిపుణులు డాక్టర్ హరీష్, ఆనంద్, కపిల్ కార్తికేయరెడ్డి, డాక్టర్ లక్ష్మణరెడ్డి, ఆసుపత్రి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిరినాయుడు, సీవోవో అంకిరెడ్డి, మెడికల్ డైరెక్టర్ శ్రీహరి రెడ్డి, వైద్య విద్యార్థులు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

–న్యూస్‌టుడే, ఒంగోలు నగరం

## కుల వివక్షపై అలుపెరగని పోరాటం


గుర్రం జాషువా విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎస్పీ దామోదర్ తదితరులు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: కుల వివక్ష, సామాజిక అసమానతలపై గుర్రం జాషువా సాగించిన అలుపెరగని పోరాటం అందరికీ స్ఫూర్తిదాయకమని కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. జాషువా జయంతిని పురస్కరించుకుని ఒంగోలు ప్రకాశం భవన్‌లో ఆయన విగ్రహానికి శనివారం పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్పీ ఏఆర్. దామోదర్, జేసీ గోపాలకృష్ణ, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి లక్ష్మానాయక్, డీఎంహెచ్‌వో సురేష్‌కుమార్, జాషువా సాహిత్య, సాంస్కృతిక సేవా సమితి అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్య, కార్యదర్శి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.


# మెరవని నల్ల రాళ్లు

▶ ఇంకా ఊపందుకోని ఎగుమతులు ▶ సగం గ్రానైట్ క్వారీల్లోనే పనులు

ఈనాడు, ఒంగోలు

ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన చీమకుర్తి గ్రానైట్ ఎగుమతులు ఇంకా పూర్తిస్థాయిలో ఊపందుకోలేదు. కొవిడ్‌తో చైనాకు ముడిరాయి ఎగుమతులు తగ్గి వ్యాపారం పడిపోయింది. అప్పటి నుంచి చైనా నుంచి బయ్యర్లు రావడం లేదు. ఆ తర్వాత 2023లో ఎగుమతులు కొంత పెరిగినట్లు కనిపించినా మళ్లీ తగ్గిపోయింది. విదేశీ వ్యాపారం లేక ప్రభుత్వ ఆదాయానికీ గండి పడుతోంది.

▶ **పట్టించుకోని వైకాపా పాలకులు...:** చీమకుర్తి మండలంలోని ఆర్‌ఎల్‌పురం, చీమకుర్తి, రామతీర్థం గ్రామాల పరిధిలో దాదాపు 45 గ్రానైట్ క్వారీల్లో 170 వరకు లీజులున్నాయి. వెలికితీసే ముడిరాయి జిల్లాలోని 1,100 కటింగ్, పాలిషింగ్ యూనిట్లతో పాటు చైనాకు ఎగుమతులుండేవి. కొవిడ్ కారణంగా చైనా నుంచి ఆర్డర్లు లేకపోయాయి. దీంతో గ్రానైట్ పరిశ్రమ కుదేలైంది. సగానికి సగం క్వారీల్లో తవ్వకాలు నిలిచిపోయాయి. గత వైకాపా పాలకులు ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించలేదు. దీంతో ఎగుమతులు నానాటికీ తీసికట్టుగా మారాయి. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలతో పాటు తుర్కియే, జర్మనీ, ఇండోనేసియా, ఆస్ట్రేలియా, బ్రెజిల్ దేశాలకు ఎగుమతి చేసే విషయాలను పరిశీలిస్తోంది. అయినా పూర్వ స్థితిలో ముడిరాయి వెలికితీత ఇంకా ఊపందుకోలేదు. ఎగుమతులు బాగా ఉన్నప్పుడు కార్మికులు మూడు విడతలుగా విధులు నిర్వహించేవారు. ప్రస్తుతం సగానికి సగం క్వారీల్లో ఉత్పత్తి నిలిచిపోయింది. పనులు చేసే వాటిల్లోనూ ఒకటి, రెండు విడతల్లోనే కార్మికులు పనిచేస్తున్నారు. వెలికితీసే రాయిలోనూ చాలా వరకు జిల్లాలోని కటింగ్ యూనిట్లు, ఇతర ప్రాంతాల రాష్ట్రాలకు తరలించేదే ఎక్కువగా ఉంటోంది.







# రక్తానికి రక్తం అక్కర్లేదు



▶ రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్‌కు జవసత్వాలు ▶ రూ. 3 కోట్లతో అధునాతన హంగులు

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే:

ప్రజలు, ప్రమాద బాధితులు అత్యవసర సమయంలో రక్తం కావాలంటే ఇంతకాలం వెతుక్కోవాల్సి వచ్చేది. సరైన సౌకర్యాలు, పరికరాలు లేక రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్‌బ్యాంక్ సేవలు ఇప్పటి వరకు నామమాత్రమే అయ్యాయి. అటువంటి బ్యాంక్‌కు ఇప్పుడు కొత్త జవసత్వాలొచ్చాయి. గవర్నర్ సిఫార్సు, కలెక్టర్ చొరవతో రూ.3 కోట్లు నిధులు సమకూరాయి. వీటితో విస్తరణ, ఆధునికీకరణకు అడుగులు పడ్డాయి. ఆధునిక యంత్ర పరికరాలు, పూర్తి సౌకర్యాలు సమకూరాయి.

▶ **ఇకపై ప్యాకెట్ సెల్స్, ప్లాస్మా...:** దాతల నుంచి సేకరించిన రక్తం వినియోగానికి అనువుగా ఉందా లేదా పరీక్షించి సరఫరా చేస్తారు. దీనిని హోల్‌బ్లడ్‌గా పిలుస్తారు. ఈ విధానంలో రోగికి రక్తం ఎక్కించడం కొంత ఆలస్యమవుతుంది. ఇప్పటివరకు రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్ ద్వారా హోల్‌బ్లడ్ విధానంలోనే సరఫరా చేసేవారు. తగిన యంత్ర పరికరాలు లేకపోవడంతో ప్యాకెట్ సెల్స్ అందించడానికి వీల్లేకుండా పోయింది. డెంగీ బాధితులకు వినియోగించే ప్లాస్మా ప్లేట్‌లెట్స్ తయారీ కూడా ఇప్పటి వరకు లేదు. ఇప్పుడు అందుబాటులోకి వచ్చిన యంత్రాలతో ఈ రెండు సమస్యలకు పరిష్కారం లభించినట్లైంది.

▶ **బదులు షరతులకు చెల్లు...:** సాధారణంగా బ్లడ్ బ్యాంక్‌కు వెళ్లినవారిని ఎవరైనా దాత వచ్చి ఇస్తే బదులుగా కావాల్సిన గ్రూపు రక్తం ఇస్తామనే షరతు విధించేవారు. రెడ్‌క్రాస్‌లో ఆ పద్ధతి లేదు. బదులు రక్తం ఇచ్చినా ఇవ్వకపోయినా కోరిన గ్రూపు రక్తాన్ని కొంత చెల్లించి పొందొచ్చు. కుక్క కాటు, పాము కాటు, హెపటైటిస్ బీ టీకాలను కూడా తక్కువ ధరకు అందజేయడానికి ఇక్కడ ఏర్పాట్లు చేస్తున్నారు.


ఆధునిక సౌకర్యాలను వివరిస్తున్న ప్రకాష్‌బాబు, రెడ్‌క్రాస్ ప్రతినిధులు


బ్లడ్ బ్యాంకులో ఏర్పాటు చేసిన యంత్ర పరికరాలు

### అందుబాటులోకి టీకాలు...

ఈ విషయాలపై రెడ్‌క్రాస్ సంస్థ ఛైర్మన్ పి.ప్రకాష్‌బాబు, వైద్యాధికారులు శనివారం నిర్వహించిన సమావేశంలో వివరించారు. ఏరోజు ఏఏ గ్రూపులు అందుబాటులో ఉన్నాయి, ఎంత నిల్వ ఉన్నదీ బహిరంగంగా తెలపనున్నట్లు చెప్పారు. ప్రస్తుతం నెలకు వంద నుంచి 150 యూనిట్ల రక్తం అవసరమైన వారికి అందిస్తున్నామని, ఇకపై రెట్టింపు చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్యే జనార్దన్, ఉన్నతాధికారుల సమక్షంలో ఈ సేవలను త్వరలో అందుబాటులోకి తేనున్నట్లు తెలిపారు.

## బాబు అభిమానం.. ఎన్నటికీ మరువలేం

నాగులుప్పలపాడు, న్యూస్‌టుడే: 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 20న మద్దిరాలపాడు వచ్చారు. ఈ సందర్భంగా గ్రామసభ నిర్వహించడంతో పాటు ఆ ఊరిలో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దనున్నట్లు ప్రకటించారు. చెప్పిన పనులను స్వల్ప వ్యవధిలోనే చేస్తుండటంపై ఆ గ్రామస్థులు సీఎంకు కృతజ్ఞతలు తెలుపుతూ శనివారం సభ నిర్వహించారు. తొలుత చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం తెదేపా నాయకులు మాట్లాడుతూ.. గ్రామంలో రోడ్లు, కాలువల నిర్మాణానికి రూ. 5.10 కోట్లు, కబరస్థాన్, షాదీఖానా ప్రహరీ ఏర్పాటుకు రూ. 23 లక్షలు, శ్మశాన వాటికల్లో సౌకర్యాల కల్పనకు రూ. 80 లక్షలు, తాగునీటి సమస్య పరిష్కారానికి రూ. 93 లక్షల నిధులు మంజూరు చేసినట్లు వివరించారు. పాత విద్యుత్తు స్తంభాలు తొలగించి కొత్తవి ఏర్పాటు చేసే పనులు ప్రారంభించారన్నారు. పటాన్ ఖాజావలి, బీబీ సారా దంపతుల పిల్లలను కళాశాలల్లో చేర్పించినట్లు చెప్పారు. ఆలుదాసు శ్రీను, రేణుక దంపతులకు అయిదు రోజుల్లోనే ఇంటి పట్టా మంజూరు చేసి అందించినట్లు తెలిపారు. సీఎం తమ గ్రామంపై చూపుతున్న అభిమానానికి జీవితాంతం రుణపడి ఉంటామన్నారు. కార్యక్రమంలో సర్పంచి స్వర్ణ అనూరాధ, ఉపసర్పంచి పెనుబోతు సునీల్, తెదేపా నేతలు గుమ్మడి సాయిబాబా, షేక్ ఖాజావలి, తాళ్లూరి ఆంజనేయులు, నెప్పల శివకృష్ణ, సిరిమళ్ల జక్రయ్య, సచివాలయ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.


చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న తెదేపా నాయకులు, లబ్ధిదారులు, మద్దిరాలపాడు వాసులు


# స్థలం అద్దెకిస్తే.. అంతమొందించాడు

▶ శీతల పానీయంలో విషం కలిపి హత్య ▶ దొనకొండలో మృతదేహం కాల్చివేత

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కేందుకు ఒంటరిగా ఉంటున్న వృద్ధురాలిని అంతమొందించిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. ఇందుకు సంబంధించిన వివరాలను చీరాల సీఐ ఎం.శ్రీనివాసరావు శనివారం వెల్లడించారు. గుర్రప్పడి విజయలక్ష్మి(79) అనే వృద్ధురాలు చీరాల పట్టణంలోని ఉజిలిపేటలో ఒంటరిగా నివాసం ఉంటున్నారు. ఆమె కుమారుడు, కుమార్తెలు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా ఉద్యోగాలు చేస్తూ వేరే చోట ఉంటున్నారు. వృద్ధురాలికి ఉజిలిపేటలో కొంత ఖాళీ స్థలం ఉంది. పాపరాజుతోటకు చెందిన పాశం కుమార్‌తేజ అనే వ్యక్తి ఆ జాగాను అద్దెకు తీసుకుని అందులో టైల్స్ వ్యాపారం చేస్తున్నాడు. ఇటీవల అతన్ని ఆర్థిక సమస్యలు చుట్టుముట్టాయి. దీంతో ఒంటరిగా ఉంటున్న విజయలక్ష్మి బంగారు నగలపై అతని చూపు పడింది. ఆభరణాలు కాజేస్తే కొన్నాళ్లు ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కొచ్చని కుతంత్రం పన్నాడు. తనకు తెలిసిన చంద్ర అనే వ్యక్తి వద్ద నుంచి విష పదార్థం తెచ్చాడు. తన వద్ద గుమస్తాగా పనిచేస్తున్న కారంచేడుకు చెందిన యార్లగడ్డ రాముకు కొంత నగదు ఆశ చూపి హత్యకు సహకరించాలని కోరాడు. అనంతరం ఈ నెల 15న విజయలక్ష్మిని దుకాణం వద్దకు పిలిపించి. . అప్పటికే విషం కలిపి సిద్ధంగా ఉంచిన శీతల పానీయాన్ని తాగించారు. వృద్ధురాలు మృతిచెందిన అనంతరం మెడలో ఉన్న బంగారు నగలు కాజేశారు. ఓ దుకాణంలో రూ.1,70,000కు తాకట్టు పెట్టాడు. ఆ డబ్బులోని కొంత మొత్తంతో ఓ కారు బాడుగకు మాట్లాడుకుని మృతదేహాన్ని దొనకొండ మండలం గంగదేవిపల్లి గ్రామ శివారుకు చేర్చారు. అక్కడ పెట్రోల్ పోసి కాల్చివేశారు. తన తల్లి కనిపించడం లేదని వృద్ధురాలి కుమారుడు వెంకటరమణ పోలీసులకు ఇటీవల ఫిర్యాదు చేశారు. అనంతరం సీసీ ఫుటేజీ పరిశీలించి.. కారు వెనుక సీటులో తన తల్లిని కూర్చోబెట్టుకుని తేజ, రాము వెళ్తుండటాన్ని గుర్తించి పోలీసులకు తెలిపారు. గంగదేవిపల్లి ప్రాంతంలోని ముళ్లపొదల్లో గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని కాల్చివేసినట్లు తెలుసుకుని పరిశీలించారు. విజయలక్ష్మిదిగా గుర్తించి హత్య కేసుగా నమోదు చేశారు. నిందితులను అదుపులోకి తీసుకొని విచారించడంతో హత్య చేసినట్లు అంగీకరించారు.


దొనకొండలో మృతదేహం కాల్చిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ, పోలీసులు(పాత చిత్రం)








## ఎంపీడీవోల రెండో జాబితా విడుదల

**ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే:** ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని ఎంపీడీవోల బదిలీలకు సంబంధించి రెండో జాబితా విడుదలైంది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 56 మండలాలు ఉండగా, అందులో ఇటీవల 22 మంది ఎంపీడీవోలకు పోస్టింగ్ ఇచ్చారు. తాజాగా మరో 10 మంది ఎంపీడీవోలకు పోస్టింగ్ ఇస్తూ జడ్పీ నుంచి శనివారం ఉత్తర్వులు విడుదల య్యాయి. అందులో 9 మంది ఇతర జిల్లాల నుంచి ప్రకాశానికి వచ్చారు.

| పేరు | మండలం |
|---|---|
| జి.రాజ్‌కుమార్ | త్రిపురాంతకం |
| ఏవీ.రంగనాయకులు | బేస్తవారపేట |
| టి.వీరభద్రాచారి | కంభం |
| వై.మహాలక్ష్మి | నాగులుప్పలపాడు |
| ఎం.శ్రీదేవి | దొనకొండ |
| పి.శివ సుబ్రహ్మణ్యం | చీరాల |
| డి.ఈశ్వరమ్మ | కొనకనమిట్ల |
| జీఏకేఎన్‌వీ.జ్యోతిర్మయి | సంతమాగులూరు |
| షేక్ మహమ్మద్ అకీబ్ జావెద్ | యద్దనపూడి |
| ఎల్.కృష్ణమూర్తి | దర్శి |

## ఆకాశమే హద్దుగా పర్యాటకుల కోలాహలం

రామోజీ ఫిల్మ్‌సిటీలో సందడే సందడి

**రామోజీ ఫిల్మ్‌సిటీ, న్యూస్‌టుడే:** పండగల వేళ పర్యాటకుల రాకతో రామోజీ ఫిల్మ్‌సిటీ సందడిగా మారింది. దసరా, దీపావళి పండగలను పురస్కరించుకుని ఈ నెల 26న ప్రారంభమైన వేడుకల్లో నిత్యం ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఫిల్మ్‌సిటీ సందర్శనకు వచ్చి మ్యూజికల్ గ్లో గార్డెన్ అందాలను వీక్షిస్తూ ముగ్ధులవుతున్నారు. ఫిల్మీ స్ట్రీట్ విశేషాలు ఆబాలగోపాలాన్ని ఆకట్టుకుంటున్నాయి. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు వేడుకల్లో పాలుపంచుకుంటూ చిన్నా, పెద్ద ఉల్లాసంగా గడుపుతున్నారు.





సరదాసరదా కార్యక్రమాలు, వినోదం పంచే ఏర్పాట్లు ప్రతి ఒక్కరినీ ఆనందతీరాలకు చేర్చుతున్నాయి. లైవ్ షోలు మధురానుభూతిని పంచుతున్నాయి. సాయంత్రం వేళల్లో సంతోషాలను ఆస్వాదించాలనుకునే పర్యాటకులు మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి వచ్చి ఆనందిస్తున్నారు. రామోజీ ఫిల్మ్‌సిటీని సరికొత్త విద్యుద్దీప కాంతుల్లో కళ్లారా వీక్షించి



రవాణా సౌకర్యం.. రామోజీ ఫిల్మ్‌సిటీలో పండగ సంబరాలకు విచ్చేసే పర్యాటకులకు హైదరాబాద్ నగరంలోని వివిధ ఎంపిక చేసిన ప్రాంతాల నుంచి పికప్, డ్రాపింగ్ సౌకర్యం కల్పిస్తున్నారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా వేడుకలను ఆస్వాదించేందుకు వచ్చే వారికి ఇది ఎంతగానో దోహదపడుతుంది.

మధుర జ్ఞాపకాలను పదిలం చేసుకుంటున్నారు. స్టూడియో టూర్‌తో ఫిల్మ్‌సిటీని చుట్టేస్తూ సినీజగత్తులో విహారాన్ని ఆస్వాదిస్తున్నారు. రాజసం ఉట్టిపడేలా సాగే కార్నివాల్ పరేడ్, సంభ్రమాశ్చర్యాలను కళ్లముందుకు తెచ్చే మోషన్ క్యాప్చర్, వర్చువల్ షూట్ ఇలా.. అనుక్షణం ఆనంద వీక్షణాలతో పండగల వేళ చిన్నాపెద్దా ఆనందిస్తున్నారు. ఇంకెందుకు ఆలస్యం.. మీరూ రామోజీ ఫిల్మ్‌సిటీ సంబరాల్లో పాలుపంచుకోవచ్చు పదండి.

మరిన్ని వివరాలకు..
www.ramojifilmcity.com ఫోన్ నంబర్ 76598 76598ను సంప్రదించవచ్చు.

## వరద బాధితులకు దాతల చేయూత



ముఖ్యమంత్రి చంద్రబాబుకు రూ.6.10 లక్షల చెక్కును అందజేస్తున్న గుర్రం వెంకటేశ్వర్లు తదితరులు



ఎమ్మెల్యే జనార్దన్‌కు చెక్కు అందిస్తున్న ఎ.వెంకటేశ్వర్లు


**పామూరు, న్యూస్‌టుడే:** విజయవాడ వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయ నిధికి పామూరుకు చెందిన గుర్రం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో వెంగమాంబ సేవా సమితి తరఫున రూ.6.10 లక్షల చెక్కును సీఎం నారా చంద్రబాబునాయుడుకు అమరావతిలోని ఆయన కార్యాలయంలో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సేవా సమితి ప్రతినిధులను అభినందించారు. కార్యక్రమంలో ఎం.శ్రీనివాసరావు, కె.రమణయ్య, ఎస్.శ్రీను, బి.ప్రసాద్, టి.రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

**ఒంగోలు గ్రామీణం:** విజయవాడ వరద బాధితులకు ఒంగోలు నగరానికి చెందిన అన్నంనేని వెంకటేశ్వర్లు రూ.1,25,116లను నగర ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌కు శనివారం అందజేశారు. కార్యక్రమంలో షేక్ రియాజ్ పాల్గొన్నారు.

## ఫ్రీ హోల్డింగ్ ప్రక్రియ పరిశీలనకు ప్రత్యేక బృందాలు

**ఒంగోలు గ్రామీణం:** భూముల ఫ్రీ హోల్డింగ్ పరిశీలన త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. దీనిపై సీసీఎల్‌ఏ జయలక్ష్మి శనివారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీక్షణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లాలోని పరిస్థితిని వివరించారు. పరిశీలన కోసం ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ల ఆధ్వర్యంలో బృందాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

## జీవన ప్రమాణాల పెంపునకు ప్రత్యేక శ్రద్ధ అవసరం



మాట్లాడుతున్న జాతోతు హుస్సేన్, చిత్రంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎస్పీ దామోదర్

**ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే:** గిరిజనుల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ సభ్యుడు జాతోతు హుస్సేన్ ఆదేశించారు. గిరిజనుల అభివృద్ధి కోసం స్థానిక ప్రకాశం భవన్‌లోని సమావేశ మందిరంలో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామ, మండల స్థాయిలో వివిధ శాఖల అధికారులపై అనేక ఫిర్యాదులు వస్తున్నాయని, జిల్లా అధికారులు సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. వారి ఆర్థిక స్థితిగతులను అర్థం చేసుకుని ఆ వర్గాల ప్రజలకు న్యాయం చేయడంలో శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలోని చెంచుగూడేల్లో మౌలిక సదుపాయాల కల్పనకు అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ.. జిల్లాలో జన్‌మన్ కార్యక్రమం కింద చెంచుల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను పటిష్ఠంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. అక్టోబర్ 1 నుంచి గ్రామసభలు నిర్వహించి అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ కొత్త పింఛను మంజూరు చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సమావేశంలో జిల్లా ఎస్పీ దామోదర్, జేసీ గోపాలకృష్ణ, జాతీయ ఎస్టీ కమిషన్ డైరెక్టర్ కల్యాణ్‌రెడ్డి, ఏఎస్పీ నాగేశ్వరరావు, జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి జగన్నాథరావు, సాంఘిక సంక్షేమశాఖ అధికారి లక్ష్మానాయక్, ఆర్డీవో సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## స్కూల్ గేమ్స్ సాఫ్ట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక



ఎంపికైన బాలికల జట్టుతో నిర్వాహకులు

**ఒంగోలు క్రీడావిభాగం:** స్కూల్ గేమ్స్ అండర్-19 బాలబాలికల సాఫ్ట్‌బాల్ జట్ల ఎంపిక ఒంగోలులోని ఏబీఎం జూనియర్ కళాశాల మైదానంలో శనివారం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఈదర చింపారెడ్డి, బొడ్డు సుబ్బారావులు మాట్లాడుతూ.. అక్టోబర్ 2 నుంచి 4వ తేదీ వరకు పశ్చిమ గోదావరి జిల్లా పెదవేగిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఎంపిక కమిటీ సభ్యులుగా దర్శి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల పీఈటీ డి.సుబ్బారావు, వెలిగొండ పీఈటీ ఎస్.చంద్రశేఖర్, మద్దిపాడు పీడీ ఎం.ఆదినారాయణరావు, పీఈటీ రాజ్యలక్ష్మి వ్యవహరించారు. ❖ **బాలుర జట్టు:** పి.వాసుదేవరాజ్, జె.రిత్విక్, షేక్ రసూల్, పి.పవన్ కల్యాణ్, ఎస్.హర్షవర్ధన్, సి.హెచ్.కార్తీక్, డి.గురుతేజ, పి.హరినాగసాయి, ఎ.ప్రణయ్, ఎ.లక్షిత్, కె.నరసింహం, జి.దుర్గారెడ్డి, ఎస్.దిలీప్‌రెడ్డి, పి.చరణ్, ఎం.మహేష్‌బాబు, ఆర్.విక్రమ్. ❖ **బాలికల జట్టు:** పి..నందిని, సాయిప్రదీప, ఎస్.కె.సాథియా, కె.మానస, కె.శ్రీవల్లి, డి.మాధురి, కె.భవ్యశ్రీ, సి.హెచ్.దక్షిత, ఎస్.హర్షిణి, లిపిక, పి.లోకేశ్వరి, కె.నిహారిక, బి.కారణ్య, ప్రణవి.

**నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర**

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 535 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ. 84/-.

**ప్రకాశం జిల్లాలో బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)**



వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం ధర - 126, రిటైల్ లైవ్ - 148, చికెన్ విత్ స్కిన్ - 215, చికెన్ స్కిన్‌లెస్- 244

## గింజలు రాని మొక్కజొన్న పంట పరిశీలన

**తాళ్లూరు, న్యూస్‌టుడే:** మండలంలో నకిలీ విత్తనాల కారణంగా గింజలురాని మొక్కజొన్న పంట పరిశీలించి వివరాలు పంపించాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.శ్రీనివాసరావు మండల ఏవోను ఆదేశించారు. తాళ్లూరు మండలంలోని పలు గ్రామాల్లో నకిలీ విత్తనాల కారణంగా మొక్కజొన్న పంట దెబ్బతిని రైతులు నష్టాల్లో మునిగి పోయారు. ఈ విషయమై 'ఈనాడు'లో శుక్ర, శనివారాలు కథనాలు ప్రచురితం కావడంతో జిల్లా వ్యవసాయాధికారి స్పందించారు. దీంతో ఏవో బి.ప్రసాదరావు శనివారం కొర్రపాటివారిపాలెంలో మొక్కజొన్న పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. తాళ్లూరులోని ఓ డీలర్ వద్ద విత్తనాలు కొనుగోలు చేసి సాగు చేపట్టామన్నారు. ఎన్నడూ లేని విధంగా ఊహించని రీతిలో కండెలు దెబ్బతిన్నాయని ఆయన వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. తమకు బిల్లులు కూడా సదరు డీలర్ అందజేయలేదని ఏవో దృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయమై శాస్త్రవేత్తలు వచ్చి ఎందుకు గింజలు రాలేదనే విషయమై విచారిస్తారని ఏవో తెలిపారు. వారి ద్వారా వాస్తవాలు గుర్తించేందుకు వీలుంటుందని, ఇక్కడి పరిస్థితులపై జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామని ఆయన తెలిపారు.



కేవీపాలెం వద్ద మొక్కజొన్న కంకులను పరిశీలిస్తున్న ఏవో ప్రసాదరావు

## క్రమశిక్షణతో ఉజ్వల భవిత



బాలసదన్ సిబ్బందికి సూచనలిస్తున్న న్యాయమూర్తి అమ్మనరాజా

**ఒంగోలు గ్రామీణం:** చిన్నతనం నుంచే విలువలతో కూడిన విద్య, క్రమశిక్షణ వల్ల జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తి డి.అమ్మనరాజా సూచించారు. ఒంగోలులోని బాలసదన్‌ను ఆయన శనివారం సందర్శించారు. విద్యార్థులకు అందుతున్న వసతి, భోజన సదుపాయాలను పరిశీలించారు. చట్టపరంగా విద్యార్థులకు అవసరమైన న్యాయ సహాయాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అందించనున్నట్లు తెలిపారు. మానసిక వైద్యుల సూచన మేరకు అవసరమైన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు.

## ఇద్దరు చిన్నారుల అదృశ్యం

**మద్దిపాడు, న్యూస్‌టుడే:** మండలంలోని దొడ్డవరప్పాడులో ఇద్దరు చిన్నారులు అదృశ్యమైన సంఘటన శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఈ 21న నెల్లూరు జిల్లా జలదంకి మండలం కమ్మవారిపాలెం నుంచి బాతులు మేపుకొనేందుకు వచ్చి దొడ్డవరప్పాడు పొలాల్లో రెండు కుటుంబాల వారు గుడిసెలు వేసుకొని ఉంటున్నారు. ఈ నెల 26న చిన్నారులను అక్కడే ఉంచి, వాళ్లతో పాటు ఉంటున్న పేరం లక్ష్మీనారాయణ అనే వ్యక్తికి పిల్లలను చూడాలని చెప్పి తండ్రి నాగులూరి లాజరు, అతని భార్య కలిసి స్వగ్రామానికెళ్లారు. మరుసటి రోజు ఉదయం వచ్చి చూడగా పిల్లలు కనిపించలేదు. ఎంత వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్సై శివరామయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## నిలిచి ఉన్న మినీ లారీని ఢీకొట్టి యువకుడి దుర్మరణం

**పామూరు, న్యూస్‌టుడే:** మండలంలోని రావికుంటపల్లి సమీపంలో 565వ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతిచెందిన సంఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్సై టి.కిషోర్‌బాబు తెలిపిన వివరాల మేరకు.. రావికుంటపల్లి పంచాయతీ పరిధిలోని కొత్తపల్లికి చెందిన తాతిరెడ్డి వీరనారాయణరెడ్డి(34), ద్విచక్ర వాహనంపై కనిగిరి మండలం బల్లిపల్లి అడ్డరోడ్డు వద్దకు వెళ్లి అక్కడ పని ముగించుకుని తిరిగి వస్తుండగా మార్గం మధ్యలో రావికుంటపల్లికి సమీపంలో జాతీయ రహదారిపై మరమ్మతులకు గురై మినీ లారీ ఆగిపోయింది. దీనిని మరో మినీ లారీతో తీసుకెళ్లేందుకు తాడుతో కడుతున్న క్రమంలో వీరనారాయణరెడ్డి ఆగిఉన్న లారీని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో అతను రహదారిపై పడడంతో తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతిచెందారు. కిలో మీటరు లోపు ప్రయాణిస్తే ఇంటికి చేరతాడనే తరుణంలో ఇలా మృత్యువాత పడ్డారు. అతడు ఒడిశాలో బోరుగులబడ్డీ నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. సోమవారం ఒడిశా వెళ్లాల్సి ఉంది. ఇంతలోనే అతడు దుర్మరణం చెందడంపై కుటుంబ సభ్యులు, బంధువులు రోదించారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

## అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య

**బేస్తవారపేట, న్యూస్‌టుడే:** అప్పుల బాధ తాళలేక బలవన్మరణానికి పాల్పడిన వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు శనివారం గుర్తించారు. ఎస్సై రవీంద్రారెడ్డి కథనం మేరకు.. మండలంలోని మోక్షగుండం గ్రామానికి చెందిన మోక్షగుండం సత్యనారాయణ (35), కుటుంబంతో బేస్తవారపేట వచ్చి ఓ క్షౌరశాలలో పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. కుటుంబ అవసరాల కోసం చుట్టుపక్కల వారి వద్ద అప్పులు చేశారు. బాకీ తీర్చాలని అప్పు ఇచ్చిన వారు ఆయనపై ఒత్తిడి తేవడంతో ఆరు రోజుల కిందట కుటుంబ సభ్యులకు క్షౌరశాలలో పనిచేసేందుకు హైదరాబాద్ వెళ్తున్నట్లు చెప్పి మోక్షగుండంలోని జగనన్న కాలనీలో నిర్మాణంలో ఉన్న ఓ ఇంటి వద్ద మద్యంలో విష ద్రావణం కలుపుకుని తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. శనివారం ఆ కాలనీలోకి వెళ్లిన గ్రామానికి చెందిన పశుకాపరులు అక్కడ ఓ ఇంటి వద్ద దుర్వాసన రావడాన్ని గమనించి పరిశీలించగా విషయం వెలుగుచూసింది. వెంటనే వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సత్యనారాయణకు భార్య తులసి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### ❖ రైలుకింద పడి కడప జిల్లా వాసి బలవన్మరణం..

**ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే:** రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఒంగోలు రైల్వేస్టేషన్‌లో శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత జరిగింది. సుమారు 1.45 గంటల సమయంలో కడప జిల్లా మైదుకూరు టీచర్స్ కాలనీకి చెందిన నాగులపాటి విద్యాసాగర్(51), రైలు కిందపడి బలవన్మరణానికి పాల్పడ్డారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్పీ ఎస్సై అరుణకుమారి తెలిపారు.

## ప్రయాణంలోనే ఆగిన వృద్ధుడి గుండె

**ఒంగోలు నేరవిభాగం:** తీర్థ యాత్రలకు వెళ్లి తిరుగు ప్రయాణంలో గుండెపోటుతో ఓ వృద్ధుడు మృతి చెందారు. ఈ సంఘటన భారత్ గౌరవ్ ఎక్స్‌ప్రెస్‌లో శనివారం చోటుచేసుకంది. జీఆర్పీ ఎస్సై అరుణకుమారి కథనం మేరకు.. విజయనగరం జిల్లా వీటీ అగ్రహారానికి చెందిన మూలా నాగేశ్వరరావు(70), తన భార్యతో కలిసి తీర్థయాత్రలకు వెళ్లారు తిరుగు ప్రయాణంలో ఆయన రైల్లోనే గుండెపోటుతో మృతిచెందారు. మృతదేహాన్ని ఒంగోలు స్టేషన్‌లో దించారు. ఆయన భార్య ఇచ్చిన సమాచారంతో కుటుంబీకులకు విషయం తెలియజేశారు.

## వసతి గృహాల తనిఖీ

పొదిలి, న్యూస్‌టుడే: పొదిలి ప్రభుత్వ ఎస్సీ బాలికల, బాలుర వసతిగృహాలను జూనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్మన్ వి.ప్రత్యూష తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భోజనాన్ని రుచి చూశారు. విద్యార్థులు ఎలా చదువుతున్నారు, రోజువారీ దినచర్యలు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న న్యాయమూర్తి ప్రత్యూష

# మార్కాపురం

•మార్కాపురం •గిద్దలూరు •యర్రగొండపాలెం

## వెలిగొండ వేంకటేశ్వర స్వామికి విశేష పూజలు

కొనకనమిట్ల, కంభం (రాచర్ల), న్యూస్‌టుడే: కొనకనమిట్ల మండలంలోని వెలిగొండ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొండపైన కొలువదీరిన లక్ష్మమ్మ ఆలయంలో పూజలు నిర్వహించారు. ❖ రాచర్ల మండలం జెల్లివారిపల్లెరువు సమీపంలోని నల్లమల అటవీ ప్రాంతంలో కొలువైన నెమలిగుండ్ల రంగనాయకస్వామికి శనివారం విశేష పూజలు నిర్వహించారు. లక్ష్మమ్మ వనం వద్ద భక్తులు పూజలు చేశారు. పలు సామాజిక సత్రాల్లో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.



## ఆగిన ఇళ్ల నిర్మాణాల పూర్తికి చర్యలు

గిద్దలూరు పట్టణం, పొదిలి, మార్కాపురం, న్యూస్‌టుడే : గత వైకాపా ప్రభుత్వం గిద్దలూరులో తెదేపా ప్రభుత్వం 80శాతం పూర్తిచేసిన టిడ్కో గృహాలను పూర్తిచేయకుండా నిర్లక్ష్యం వహించిందని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. గిద్దలూరు నగర పంచాయతీ రాజానగర్‌లో గృహ నిర్మాణశాఖ లబ్ధిదారులతో శనివారం ఏర్పాటు చేసిన 'మన ఇల్లు-మన గౌరవం' అవగాహన సదస్సులో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిలిచిపోయిన, ప్రారంభించని టిడ్కో గృహ నిర్మాణాలను పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జగనన్న కాలనీలో గృహాలు, ప్లాట్లు విక్రయాలు చేసి దుర్వినియోగానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ❖ పొదిలి గృహనిర్మాణశాఖ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొన్న నగర పంచాయతీ కమిషనర్ పూసల శ్రీనివాసులు మాట్లాడుతూ ఆగిన పోయిన పనులు పక్కా ఇళ్లను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని కోరారు. ❖ మార్కాపురం మండలంలోని ఇడుపూరు గ్రామంలో మన ఇల్లు- మన గౌరవం కార్యక్రమాన్ని మార్కాపురం గృహనిర్మాణశాఖ డీఈ పవన్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ పీఎంఏవై పథకంలో మంజూరైన ఇళ్ల కాలపరిమితి మార్చి 2025తో ముగుస్తుందని కనుక లబ్ధిదారులు మంజూరైన ప్రతి ఇంటిని త్వరగతిన పూర్తి చేసుకోవాలన్నారు.


గిద్దలూరులో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి


మార్కాపురం మండలం ఇడుపూరులో మన ఇల్లు-మన గౌరవం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న గృహనిర్మాణశాఖ డీఈ పవన్‌కుమార్, అధికారులు

## కోలాటం.. ఆధ్యాత్మిక చైతన్యం

❖ ఆసక్తితో నేర్చుకొని రాణిస్తున్న మహిళలు ❖ జానపద కళలకు జీవం పోస్తూ..


చెన్నకేశవస్వామి తిరునాళ్ల సందర్భంగా కోలాటం చేస్తున్న మహిళలు

మార్కాపురం పట్టణం, కొమరోలు (గ్రామీణం), న్యూస్‌టుడే :

ఒక పక్క కుటుంబ బాధ్యతలు నిర్వహిస్తూనే మరో పక్క తమ కిష్టమైన కళలను నేర్చుకొని వాటి ప్రదర్శించడమే కాక మరుగున పడిపోతున్న జానపద కళలకు జీవం పోస్తున్నారా మహిళలు. కోలాటం నేర్చుకొని తిరునాళ్లతో పాటు ప్రత్యేక సందర్భాల్లో ఉచితంగా ప్రదర్శనలిస్తూ పలువురికి మన్ననలు పొందుతున్నారు. వారే మార్కాపురం పట్టణంలోని మహిళలు, కొమరోలుకు చెందిన వాసవీ మహిళా మండలి సభ్యులు. పట్టణంలో, గ్రామాల్లో ప్రదర్శనలు ఇస్తూ కళలపై ఆసక్తిని పెంచుతున్నారు.

### 8 సంవత్సరాలుగా ప్రదర్శనలు..

మార్కాపురం పట్టణంలో కోలాటం నేర్చుకున్న 200 మంది మహిళలైన గృహిణులు, అంగన్‌వాడీ సిబ్బంది, ఉపాధ్యాయినిలు, మెప్మా ఆర్పీలు పట్టణంలో జరిగే తిరునాళ్లలు, పండుగలు, వినాయక చవితి ఉత్సవాల్లో ఉచితంగా కోలాటం ప్రదర్శిస్తూ ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందిస్తున్నారు. ఒక్కో గ్రూపులో 30 మంది చొప్పున కోలాటం చేస్తూ ఐక్యతను చాటుతున్నారు. చెన్నకేశవస్వామి తిరునాళ్ల, రథసప్తమి, పండుగలతో పాటు కాటంరాజు తిరునాళ్ల, కార్తీక పౌర్ణమి, శివరాత్రి కృష్ణాష్టమి వేడుకల్లో తమ కళను ప్రదర్శిస్తూ కోలాటంపై ఆసక్తి కలిగించేలా చూస్తున్నారు.

### గ్రామాల్లో..

కొమరోలుకు చెందిన వాసవీ మహిళా మండలి సభ్యులు పట్టణ ప్రాంతాల్లో కాక మారుమూల గ్రామీణ ప్రాంతంలో పండగరోజుల్లో, పర్వదినాల్లో కోలాట ప్రదర్శన ఇస్తూ ఆధ్యాత్మికతను పెంపొందిస్తున్నారు. పదిహేన్నేళ్ల కిందట కడప జిల్లా మల్లేపల్లెకు చెందిన బాలకృష్ణాచారి ఆధ్వర్యంలో శిక్షణ తీసుకున్న జాలాది సరిత మరో 30 మంది మహిళలతో కలిసి శిక్షణ తీసుకొని శివరాత్రి పర్వదినం, కార్తీక పౌర్ణమి, దసరా నవరాత్రుల్లో ఉచితంగా కోలాటం ప్రదర్శన చేస్తూ ఆధ్యాత్మికత భావన ప్రజల్లో కలిగేందుకు తమ ప్రయత్నం చేస్తున్నారు.


కొమరోలులో శిక్షణ తీసుకుంటున్న మహిళలు

### భక్తిభావం పెంపొందుతుంది



సమాజంలో ప్రాచీన కళలు అంతరించి పోకూడదన్న ఉద్దేశంతోనే కోలాటం పై ఆసక్తి పెంచుకొని నేర్చుకున్నా. నాతోటి సభ్యులతో కలసి కోలాటం చేయడం చాలా సంతృప్తినిస్తుంది. దీంతో పాటు భక్తిభావం పెంపొందుతుంది.

– జి.అరుణ, గృహిణి, మార్కాపురం

### యువత దృష్టి పెట్టాలి



ఆధ్మాత్మిక భావనతో ప్రదర్శన చేయడం వల్ల మనస్సుకు ప్రశాంతత లభిస్తుంది. పదేళ్లుగా కోలాట ప్రదర్శనలో పాల్గొంటున్నాను. నేటి యువత చరవాణులకు అలవాటు పడకుండా సాంప్రదాయ నృత్యాలను నేర్చుకోవడం ఎంతో మంచింది.

– వి.భూలక్ష్మి, గృహిణి, మార్కాపురం

### చాలా ఆనందంగా ఉంది



నేను నేర్చుకున్న విద్యను నా తోటి మహిళలకు నేర్పించాలన్నదే లక్ష్యం. దీంతో కొన్ని పనులు సైతం పక్కన పెట్టి కోలాటం నేర్పిస్తున్నా. చిన్నపుడు ఇటువంటి కళలను ఎంతో ఇష్టంతో చూసేవాళ్లం. దీంతో ఈ కళకు జీవం పోయాలన్నదే నా లక్ష్యం. ఇప్పటి వరకు 50మంది వరకు కోలాటం శిక్షణ ఇస్తూ ముందుకు సాగుతున్నా.

– వి.వెంకట సుభాషిణి, శిక్షకురాలు

### అవగాహన కల్పించాం..



ఇంటింటికే పరిమితమైన మహిళలను కోలాటం శిక్షణ కోసం మొదటి ఏడాది రప్పించడానికి ఎంతో కృషి చేశాం. మొదట్లో పది మందితో ప్రారంభించిన ఈ కోలాట ప్రదర్శన నేడు 30 మందితో ప్రతి ఏడాది దసరా, శివరాత్రి, కార్తీక మాసం రోజుల్లో ప్రదర్శన నిర్వహించే స్థాయికి చేరింది. కొమరోలుతో పాటు పరిసర గ్రామాల్లో కూడా ప్రదర్శన ఇస్తున్నాం. తిరుమల శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో ప్రదర్శన కోసం ప్రయత్నిస్తున్నాం.

– జాలాది సరిత, శిక్షకురాలు

## ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా పూజలు

కంభం (రాచర్ల), న్యూస్‌టుడే : కలియుగ దైవం వేంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదంలో జరిగిన కల్తీకి ప్రాయశ్చిత్తంగా జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ చేస్తున్న దీక్షకు మద్దతుగా రాచర్ల మండలం జనసేన అధ్యక్షుడు పుట్టా బాలకృష్ణ శనివారం ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. రాచర్లలోని ఆంజనేయ స్వామి గుడిలో పూజలు చేసి అక్కడ నుంచి నెమలి గుండ్ల రంగనాయస్వామి ఆలయానికి చేరుకొని అర్చనలు, పూజలు చేయించి దీక్ష విరమించారు.


నెమలిగుండ్ల రంగనాయకస్వామి ఆలయంలో పూజలు చేయిస్తున్న జనసేన నాయకులు

## దుష్ప్రచారం ఆపండి

మార్కాపురం పట్టణం, పొదిలి : తిరుమల లడ్డూ ప్రసాదంపై, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తిరుమల దర్శనంపై అధికార పక్షం చేస్తున్న దుష్ప్రచారాన్ని ఇకనైనా ఆపాలని మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు హితవు పలికారు. శనివారం మార్కాపురంలోని చెన్నకేశవస్వామి ఆలయంలో, పొదిలిలోని శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయంలో ఆయన నాయకులతో కలసి దుష్ప్రచారం, పాపం నశించాలని కోరుతూ పూజలు చేశారు.


చెన్నకేశవస్వామి ఆలయంలో మాజీ ఎమ్మెల్యే రాంబాబు, వైకాపా నాయకులు

## చేప చిక్కేనా..



ఈ చిత్రంలో కనిపిస్తున్నది కంభం చెరువు. చెరువు కట్టలోని రాళ్లు, మెట్లపై కూర్చొని గాలులు వేసి చేపలు పట్టుకుంటున్న ఈ యువకులు కంభం చుట్టుపక్కల గ్రామాలకు చెందిన వారు. కొందరికి త్వరగా చేపలు పడితే, మరికొందరు మాత్రం గంట తరబడి వేచి చూడాల్సి వస్తోంది. చేపలు చిక్కిన వారు ఉత్సాహం వెళ్లితే, చిక్కని వారు నిరుత్సాహంగా నిరీక్షిస్తుండటం శనివారం చెరువు వద్ద కనిపించింది. – న్యూస్‌టుడే, కంభం..

## ప్రజల పక్షాన పోరాడిన వ్యక్తి ఏచూరి

మార్కాపురం పట్టణం: ప్రజల పక్షాన కడవరకు పోరాడిన వ్యక్తిగా సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారం ఏచూరి నిలిచిపోతారని ఏపీడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు ఐవీ.సుబ్బారావు పేర్కొన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏచూరితో పాటు, ఇటీవల మృతి చెందిన ఈటీవీ హైదరాబాద్ బ్యూరో తన్నీరు ఆదినారాయణ చిత్రపటాలకు వారు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు ఎన్‌వీ.రమణ, ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు డి.మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సీతారాం ఏచూరి, ఈటీవీ బ్యూరో ఆదినారాయణ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఏపీడబ్ల్యూజే సభ్యులు

## మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

మార్కాపురం : 8008631313
గిద్దలూరు పట్టణం: 8008574135
యర్రగొండపాలెం : 8008552658
కంభం : 8008574141
పొదిలి : 8008550360

పెద్దదోర్నాల, న్యూస్‌టుడే :

సమస్య : గంటవానిపల్లె తీగలేరు వాగుపై వంతెన లేకపోవడంతో వర్షాలు కురిసినప్పుడు ఇబ్బందులు పడుతున్నాం. వంతెన నిర్మించండి – జీనా, గంటవానిపల్లె

సమాధానం : వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడతాం.

– రవీంద్రారెడ్డి, పంచాయతీరాజ్ ఏఈ, దోర్నాల.

తర్లుపాడు, న్యూస్‌టుడే:

? : : మండలంలోని తుమ్మలచెరువులోని ప్రధాన వీధుల్లోని కాలువల్లో పూడిక పేరుకుపోయి మురుగునీరు నిలిచిపోతోంది. ఇబ్బందిగా ఉంది. –కాశయ్య, తుమ్మలచెరువు

✓ :: సీసీ రోడ్లు వేయడంతో మురుగు నీరు వెళ్లు మార్గం లేక సమస్య వస్తోంది. సర్పంచితో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తాం. – శిరీష, పంచాయతీ కార్యదర్శి, తుమ్మలచెరువు

మార్కాపురం, న్యూస్‌టుడే:

? : మార్కాపురం-కంభం రహదారిలోని ఆంజనేయస్వామి దేవాలయంకు ఎదురుగా గుంత ఏర్పడింది. రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. – ధనంకుల తేజ, మార్కాపురం



✓ :: గుంతను పూడ్చడానికి చర్యలు తీసుకుంటాం.

– సందీప్, ఆర్‌అండ్‌బీ, ఏఈ, మార్కాపురం

## క్రీడా పోటీల్లో విద్యార్థుల సత్తా

కొనకనమిట్ల, న్యూస్‌టుడే: కడపలో ఈ నెల 23న జరిగిన రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలో (అండర్-14 విభాగంలో) వెలిగొండ గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థి వై. జశ్వంత్ సత్తా చాటి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడని ప్రిన్సిపల్ వెంకటేశ్వరరావు తెలిపారు. నెల్లూరు జిల్లా కందుకూరు టీఆర్‌ఆర్ జూనియర్ కాలేజీ ఆవరణంలో నిర్వహించిన జిల్లా స్థాయి హ్యాండ్‌బాల్, రగ్బీ పోటీల్లో (అండర్ 14, 17 విభాగాల్లో) వెలిగొండ విద్యార్థులు జశ్వంత్, మనోహర్, అభిలాష్, నందివర్ధన్, యేవతేజ, మహంత్ సత్తా చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ పేర్కొన్నారు.

**పొదిలి, త్రిపురాంతకం గ్రామీణం** : నియోజక వర్గ స్థాయిలో జరిగిన వాలీబాల్ పోటీల్లో (అండర్-17, అండర్-14 విభాగాల్లో) పొదిలి నిర్మలాకాన్వెంట్ విద్యార్థులు పి. చరణ్, డి.హర్షవర్ధన్, పి.బ్రహ్మాచరణ్, సాత్విక్, వి.జీవన్, వి.చందులు సత్తా చాటి జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ సిస్టర్ రూబీ తెలిపారు. ❖ త్రిపురాంతకం మండలంలోని విశ్వనాధపురం జడ్పీ పాఠశాలకు చెందిన బి.శివరామకృష్ణ, ఎం.సంధ్య, టి.అమూల్య, బి.నందిని, బి.నవీణ్, బి.ప్రణతి, హరీష్, కె.శ్రీకృష్ణ, లక్ష్మీరంగ, రాజ్యలక్ష్మి నియోజకవర్గ స్థాయిలో పలు క్రీడాంశాల్లో గెలుపొంది జిల్లా స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం జి. కళ్యాణి, పీడీ మాగులూరి కోటేశ్వరావు తెలిపారు.


కొనకనమిట్ల : జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు


పొదిలిలో జాషువా చిత్రపటానికి పూలమాల వేసి స్మరించుకుంటున్న ఎంఈఎఫ్ నాయకులు

## ఘనంగా గుర్రం జాషువా జయంతి

పొదిలి, యర్రగొండపాలెం పట్టణం, న్యూస్‌టుడే: పొదిలి సీటీబీ చర్చిలోని కమ్యూనిటీ హాలులో శనివారం రాత్రి ఎంఈఎఫ్ ఆధ్వర్యంలో గుర్రం జాషువా జయంతి కార్యక్రమం నిర్వహించారు. జాషువా చిత్రపటానికి పూలమాలవేసి స్మరించుకున్నారు. ఆయన చేసిన సేవలను ఎంఈఎఫ్ నాయకులు, తెలుగు ఉపాధ్యాయులు కొనియాడారు. పొదిలిశాఖ గ్రంథాలయంలో జాషువా చిత్రపటానికి పాఠకులు పూలమాల వేసి స్మరించుకున్నారు. ❖ వై.పాలెంలో జాషువా జయంతిని శనివారం ఆలేటి సొసైటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక డివైడర్ ఏర్పాటు చేసిన జాషువా విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.


యర్రగొండపాలెంలో జాషువా విగ్రహానికి పూలమాలలు వేస్తున్న దృశ్యం

## సంక్షిప్త సమాచారం

**అక్టోబర్ 2న సత్యాగ్రహ దీక్ష : మార్కాపురం పట్టణం, న్యూస్‌టుడే** : మున్సిపల్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో అక్టోబర్ 2వ తేదీన అన్ని మున్సిపాలిటీల వద్ద సత్యాగ్రహ దీక్ష చేపడుతున్నట్లు యూటీఎఫ్ నాయకులు తెలిపారు.

**విద్యార్థులకు వక్తృత్వ పోటీలు** : కొమరోలు గ్రామీణం, కంభం (రాచర్ల): ఎస్‌బీఎన్‌ఆర్‌ఎం ఉన్నత పాఠశాల విద్యార్థులకు యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై వకృత్వ, వ్యాస, క్విజ్ పోటీలను నిర్వహించారు. ❖ బాల సభ కార్యక్రమంలో భాగంగా రాచర్ల మండలం జేపీ చెరువుఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ❖ కంభం ఎంఈవో కార్యాలయంలో విద్యార్థులకు వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు.

**మాట నిలబెట్టుకున్న సీఎంకు కృతజ్ఞతలు : పొదిలి** : పొదిలి పదోవార్డుకు చెందిన షేక్ బీబిజాన్ కుటుంబానికి ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం పరిహారం రూ.4 లక్షలు మంజూరు చేయడంతో శనివారం కేక్ కత్తిరించి తెదేపా నాయకులు, కార్యకర్తలకు తినిపించారు.

**అభినందన సభ : పొదిలి** : బాప్టిస్టుపాలెం ప్రాథమిక పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థి షాలెమ్‌రాజు నీట్ పరీక్ష రాసి కాకినాడ రంగరాయ మెడికల్ కళాశాలలో సీటు సాధించడంతో పూర్వ ఉపాధ్యాయ బృందం శనివారం విద్యార్థిని, అతని తల్లిదండ్రులను సన్మానించారు.

**వ్యవసాయ సహాయకునికి డాక్టరేట్ : బేస్తవారపేట గ్రామీణం** : గ్రామీణ ప్రాంత రైతులకు వ్యవసాయ సేవలు అందించినందుకు గంటాపురం గ్రామానికి చెందిన కందుల హనుమంతారెడ్డికి గౌరవ డాక్టరేట్ లభించింది. తమిళనాడులోని హోసూర్‌లోని ఏసియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ డాక్టరేట్ డిగ్రీ అందించినట్లు ఆయన తెలిపారు.

**శిక్షణా తరగతులను జయప్రదం చేయండి : మార్కాపురం** : స్థానిక ఏపీ ఎన్జీవో హోంలో 30వ తేదీన జిల్లా వ్యవసాయ కార్మిక సంఘంకు సంబంధించి జిల్లా స్థాయిలో శిక్షణతరగతులను నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధ్యక్షుడు గుమ్మా బాలనాగయ్య కోరారు. శనివారం మార్కాపురంలోని ప్రజా సంఘాల కార్యాలయంలో వ్యవసాయ కార్మిక సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, కార్యకర్తలు తప్పనిసరిగా పాల్గొన్నాలని ఆయన కోరారు.

**జూదరుల అరెస్టు : కంభం** : స్థానిక కందులాపురం కూడలి సమీపంలో మట్కా ఆడుతున్న ఏడుగురిని శనివారం రాత్రి అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై నరసింహారావు తెలిపారు. వారి నుంచి రూ. 5,760 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

## పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం


మార్కాపురం జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో మొక్కలను తొలగిస్తున్న విద్యార్థులు

మార్కాపురం పట్టణం, యర్రగొండపాలెం పట్టణం : న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని నెహ్రూ యువ కేంద్రం యూత్ వాలంటీర్ శ్రీధర సాయిసుబ్బారావు పేర్కొన్నారు. పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు, దీక్షా యూత్ సర్వీస్ ఆర్గనైజేషన్ సంస్థ సభ్యులు పరిసరాలను శుభ్రం చేశారు. * యర్రగొండపాలెం ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛతా హిసేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్టీసీ బస్టాండ్ పరిసర ప్రాంతాలను శుభ్రం చేశారు.


యర్రగొండపాలెం ఆర్టీసీ బస్టాండ్‌లో చీపురు పట్టి ఊడుస్తున్న డిగ్రీ కళాశాల విద్యార్థులు

## లారీ బోల్తా.. డ్రైవర్‌కు గాయాలు

కొమరోలు గ్రామీణం, న్యూస్‌టుడే: మూలమలుపు వద్ద అదుపుతప్పి పైపుల లారీ బోల్తా పడిన సంఘటన మైదుకూరు-తాటిచెర్ల మార్గంలోని అయ్యవారిపల్లె గ్రామ సమీపంలోని మూల ములపు వద్ద చోటుచేసుకుంది. కర్ణాటక రాష్ట్రం బళ్లారి నుంచి ఒడిశా రాష్ట్రంలోని కోరాపుట్‌కు ఇనుప పైపులు తరలిస్తున్న లారీ అయ్యవారిపల్లె సమీపంలోని మూలమలుపు వద్ద శనివారం తెల్లవారు జామున అదుపు తప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో లారీ డ్రైవర్ శ్యాం శంకర్‌కు స్వల్ప గాయాలు కావడంతో 108 వాహనంలో కొమరోలు పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్నారు. సమాచారం అందుకున్న కొమరోలు ఎస్సై ఎం.వెంకటేశ్వర నాయక్ సిబ్బందితో వెళ్లి ట్రాఫిక్‌ను సరిదిద్దారు.


బోల్తా పడిన లారీ


## ద్విచక్ర వాహనాలు ఢీ కొని..

పొదిలి, న్యూస్‌టుడే: పొదిలి మండలం మాదాలవారిపాలెం గ్రామ సమీపంలో శనివారం రాత్రి రెండు ద్విచక్రవాహనాలు ఢీ కొన్న సంఘటనలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తిని 108 వాహనంలో పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

## మూగజీవాల మేతలోనూ మోసం


రంపపు పొట్టు కలిపిన తవుడు

త్రిపురాంతకం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని గొల్లపల్లిలో ఓ వ్యాపారి కల్తీ తవుడును విక్రయించి పశుపోషకులకు కుచ్చుటోపీ పెట్టిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధిత రైతులు తెలిపిన వివరాల మేరకు.... ఓ వ్యాపారి 15 రోజుల క్రితం మినీ లారీలో తవుడు తీసుకొచ్చి గ్రామంలో పలువురికి విక్రయించారు. ఇతర ప్రాంతానికి చెందిన వ్యక్తి కావడంతో అతన్ని గ్రామస్థులు నమ్మ లేదు. దీంతో ఆ వ్యాపారి ప్రత్యేకంగా తన వెంట తెచ్చుకున్న బియ్యం ద్వారా తీసిన ఒరిజనల్ తవుడును నీటిలో కలిపి శాంపిల్‌గా చూపించాడు. ఆ దాణా నీటిలో కరగడంతో ఆటోలో తెచ్చిన తవుడును గ్రామస్థులు ఒరిజనల్‌గా భావించారు. ఈక్రమంలో గ్రామానికి చెందిన పశుపోషకులు కటిక రంగనాయకులు 2, కె.ప్రవీణ్ 12, సిద్దాటపు గోవిందయ్య 3, మచ్చా బాలరాజు, మచ్చా వెంకటేశ్వర్లు ఐదేసి బస్తాల చొప్పున కొనుగోలు చేశారు. ఆ వ్యాపారి ఒక్కో బస్తా రూ.వెయ్యి నుంచి రూ.1,500ల వరకు డిమాండ్‌ను బట్టి విక్రయించడంతో 50 మంది రైతులు ఆ తవుడును కొనుగోలు చేశారు. ఆ దాణాను నీటిలో కలపగా అంతా తేలియాడుతోందని బాధిత రైతులు వాపోయారు. దాంట్లో సా మిల్లు వద్ద లభించే రంపపు పొట్టుతో పాటు నూకలు, బియ్యపు పొట్టు కల్తీ కలిపినట్లు పశుపోషకులు పేర్కొన్నారు. గ్రామం మొత్తం మీద దాదాపు రూ.రెండు లక్షల రూపాయలు మోసం చేసి కల్తీ తవుడును అంటగట్టాడని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇదేం మోసం అని ఆ వ్యాపారిని అడిగితే తనదని తెలంగాణ ప్రాంతమని చెప్పి తప్పించుకుంటూ సమాధానం చెప్పడం లేదని వారు పేర్కొన్నారు.


నీటిలో కలపగా తేలిన నూక, రంపపు పొట్టు

## టూరిజం కార్పొరేషన్ ఛైర్మన్‌కు అభినందన వెల్లువ

పొదిలి, త్రిపురాంతకం గ్రామీణం, యరగొండపాలెం పట్టణం, కంభం(రాచర్ల), న్యూస్‌టుడే: రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ ఛైర్మన్ నూకసాని బాలాజీని ఒంగోలు తెదేపా కార్యాలయంలో శనివారం పొదిలి మండల తెదేపా నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.❖ బాలాజీని జిల్లా తెలుగు రైతు కార్యదర్శి కంచుపాటి బ్రహ్మయ్య శనివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛాన్ని అందించారు. త్రిపురాంతకం ఆలయాల గురించి వివరించి, ఆలయాలను పర్యాటకంగా అభివృద్ధి చేయాలని కోరారు. ❖ యర్రగొండపాలేనికి చెందిన తెదేపానాయకుడు కామేపల్లి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో, రాచర్ల మండల తెదేపా అధ్యక్షుడు కటికె యోగానంద్ ఆధ్వర్యంలో తెదేపా నాయకులు నూకసానిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

**కురిచేడు, న్యూస్‌టుడే:**

**సమస్య:** మండలంలోని పడమర కాశీపురంలో పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నీటి ట్యాంకులను పాలిపెట్టి అధ్వానంగా ఉన్నాయి. ట్యాంకులపై మూతలు ఏర్పాటు చేసి, శుభ్రపరచగలరు. — అబిరామ్, స్థానికుడు

**సమాధానం:** వారం రోజుల్లో ట్యాంకులను శుభ్రరిచి, మూతలు ఏర్పాటు చేస్తాం. — జయరాజ్, పంచాయతీ కార్యదర్శి, పడమర కాశీపురం

**మర్రిపూడి, న్యూస్‌టుడే:**

**సమస్య:** మండలంలోని అయ్యప్పరాజుపాలెం బీసీ కాలనీలో మురుగునీరు నిలిచిపోయి దుర్వాసన వస్తోంది. స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి పారిశుద్ధ్య నిర్వహణ పనులు చేయించాలి. -ప్రసాద్, స్థానికుడు

**సమాధానం:** పంచాయతీ కార్యదర్శితో మాట్లాడి వెంటనే పనులు చేయిస్తాం. -సాంబశివరావు, ఈవోఆర్డీ

# కనిగిరి

•కనిగిరి •దర్శి •కొండపి

## పొగాకు గరిష్ఠ ధర రూ. 358

కొండపి గ్రామీణం, న్యూస్‌టుడే: కొండపి వేలం కేంద్రంలో శనివారం 1,171 పొగాకు బేళ్లను కొనుగోలు చేసినట్లు వేలం నిర్వహణాధికారి జి. సునీల్ కుమార్ తెలిపారు. బోర్డు పరిధిలోని చిన్న వెంకన్నపాలెం, వెన్నూరు గ్రామాలకు చెందిన రైతులు వేలం కేంద్రానికి రైతులు 1,502 బేళ్లను అమ్మకానికి తీసుకురాగా 331 బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించారు. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.358, కనిష్ఠ ధర రూ.150, సరాసరి ధర రూ. 239.12 పలికిందన్నారు. ● టంగుటూరు: టంగుటూరు పొగాకు వేలం కేంద్రంలో 1,005 బేళ్ల కొనుగోలు చేశారు. మండలంలోని కమ్మవారిపాలెం, కట్టుబడిపాలెం, చిరికురాలపాడు గ్రామాలకు చెందిన రైతులు శనివారం 1,308 బేళ్లను తీసుకురాగా.. అందులో 1,005 బేళ్లను వివిధ కంపెనీలు కొనుగోలు చేశాయి. 303 బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరించారు. గరిష్ఠ ధర రూ.358, కనిష్ఠ ధర రూ.160గా నమోదైంది.


దర్శి మండలం పోతవరంలో మాట్లాడుతున్న గొట్టిపాటి లక్ష్మి


కనిగిరి: స్వర్ణాంధ్ర గోడప్రతులను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి, తెదేపా నాయకులు

# యువ నేస్తం.. సేవా పథం

సింగరాయకొండ గ్రామీణం, న్యూస్‌టుడే:

ఆపదలో ఉన్నవారికి మేమంటూ చేయూతనందిస్తున్నారు ఆ యువకులు. వివిధ కార్యక్రమాల ద్వారా సేవలందిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు. మూడేళ్ల కిందట కరోనా మహమ్మారి ఎంతోమంది ప్రాణాలు బలిగొంది. మృతిచెందిన వారి అంత్యక్రియలు చేసేందుకు కుటుంబ సభ్యులు, బంధువులు ఎవ్వరూ సాహసించని వేళ.. ప్రాణాలను సైతం లెక్క చేయక ముందుకొచ్చి అన్నీ తామై నిర్వహించారు. అంతేకాకుండా యాచకులు, అనాథల కర్మాఖండాలు సొంత నిధులతో నిర్వహిస్తున్నారు. సింగరాయకొండ, టంగుటూరు, పరిసర ప్రాంతాల్లో తమ సేవా కార్యక్రమాలు కొనసాగిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. స్థానిక యువనేస్తం ఫౌండేషన్ సభ్యులు. వారిపై న్యూస్‌టుడే ప్రత్యేక కథనం.

### ఆకలి తీరుస్తూ..

యువనేస్తం ఫౌండేషన్ సభ్యులందరూ నిరుపేద కుటుంబంలో జన్మించిన వారే. ప్రతి ఒక్కరూ రోజూవారీ కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తుంటారు. జాతీయ రహదారి వెంబడి నిత్యం ఆకలితో అలమటించే అనాథలకు, యాచకులు, వృద్ధులకు దాతల సహకారంతో, సొంత నిధులతో భోజన పొట్లాలను అందజేస్తున్నారు. అంతే కాకుండా వివాహాది శుభకార్యక్రమాల్లో మిగిలిన ఆహారాన్ని సేకరించి శివారు ప్రాంతాల్లోని నిరుపేదలకు పంపిణీ చేస్తారు. ఒంగోలు, నెల్లూరు, గుంటూరు, విజయవాడ తదితర ప్రాంతాల్లోని ఆసుపత్రుల్లో ప్రమాదాలకు గురైన వారు, వివిధ వ్యాధులతో ప్రాణాపాయంతో కొట్టుమిట్టాడుతున్న వారికి రక్తదానం చేస్తూ ప్రాణాలకు కాపాడుతున్నారు. జిల్లాలోని మండల కేంద్రాల్లో రక్తదాన శిబిరాలు నిర్వహించి జిల్లా కేంద్రానికి పంపిణీ చేస్తున్నారు. బృందంలో 30 మంది సభ్యులు ఉన్నారని, ఇప్పటికీ సుమారు 1,140 మందికి రక్తదానం చేసినట్లు ఫౌండేషన్ ఛైర్మన్ బంగారుబాబు తెలుపుతున్నారు.


యువనేస్తం ఫౌండేషన్‌లోని సభ్యులు



### తొమ్మిది సార్లు రక్తదానం చేశా..

రక్తదానం చేయడం వల్ల మనిషి ప్రాణాలు కాపాడిన వారమవుతామన్నారు. ఏడాది కాలంలో తొమ్మిది సార్లు ఆసుపత్రుల్లో వైద్యం పొందుతూ ఆపదలో ఉన్నవారికి రక్తదానం చేశాను. కరోనా సమయంలో ఫౌండేషన్ తరపునఎంతో మందికి అంత్యక్రియలు నిర్వహించాం.

– రాయపాటి రవివర్మ, సింగరాయకొండ



### భవిషత్తులోనూ కొనసాగిస్తాం..

నాలుగేళ్లుగా ఫౌండేషన్ సభ్యుడిగా కొనసాగుతున్నా. లారీలు, వివిధ వాహనాల టైర్లకు పంచర్లు వేస్తూ జీవనం సాగిస్తున్నా. సుమారు 15 మందికి ఆసుపత్రుల్లో ప్రాణాపాయ స్థితిలో ఉండగా రక్తదానం చేశా. భవిష్యత్తు ఫౌండేషన్ తరుపున సేవా కార్యక్రమాలు కొనసాగిస్తాం.

– గునిమిని శ్రీకాంత్, సింగరాయకొండ

# అభివృద్ధే కూటమి ప్రభుత్వ అజెండా

**కనిగిరి, న్యూస్‌టుడే:** అభివృద్ధే కూటమి ప్రభుత్వ అజెండా అని ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి పేర్కొన్నారు. కనిగిరి మున్సిపాలిటీలోని 11 వార్డులో శనివారం నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వంద రోజుల పాలనలో ప్రభుత్వం అమలు చేసిన పథకాలను ఎమ్మెల్యే వివరించారు. అనంతరం స్వర్ణాంధ్ర గోడప్రతులను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ దానియేల్ జోసెఫ్, తెదేపా నేతలు రాచమల్ల శ్రీనివాసరెడ్డి, బ్రహ్మంగౌడ్ తదితరులు పాల్గొన్నారు. ● పామూరు మండలం బొట్లగూడూరులో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర విభిన్న ప్రతిభావంతుల ప్రధాన కార్యదర్శి అడుసుమల్లి ప్రభాకర్ చౌదరి పాల్గొన్నారు. ● **దర్శి:** పేదవాడి సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తుందని తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి గొట్టిపాటి లక్ష్మి అన్నారు. మన ఇల్లు-మన గౌరవం కార్యక్రమంలో భాగంగా మండలంలోని పోతవరంలో నిర్వహించిన గ్రామసభలో గృహాలు మంజూరైన లబ్ధిదారులతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ.. లబ్ధిదారుల ఇబ్బందులను తెలుసుకుని వాటిని పరిష్కరించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. గృహనిర్మాణశాఖ డీఈ నిరీక్షణరావు, ఇతర అధికారులు, సచివాలయ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు. ● దర్శి సామాజిక వైద్యశాలలో గర్భిణీలకు సుఖ ప్రసవం కోసం ఉపయోగపడే సీటీజీ యంత్రాన్ని ఇచ్చిన హామీ మేరకు తెదేపా నాయకురాలు లక్ష్మి శనివారం వైద్యశాల సూపరింటెండెంట్ డా.సుమన్‌కు యంత్రాన్ని అందజేశారు.

● **బాలాజీని మండల తెదేపా నాయకులు: తాళ్లూరు:** ఒంగోలు పార్లమెంట్ తెదేపా అధ్యక్షుడు, రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ నూకసాని బాలాజీని శనివారం తాళ్లూరు మండలానికి చెందిన పలువురు తెదేపా నాయకులు కలిశారు. ఒంగోలులోని కార్యాలయానికి వెళ్లి ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.

# మొక్కుబడిగా సర్వసభ్య సమావేశం

**దర్శి, న్యూస్‌టుడే:** దర్శి నగర పంచాయతీ సర్వసభ్య సమావేశం శనివారం మొక్కుబడిగా సాగింది. ఒకటో సచివాలయం కార్యాలయంలో ఛైర్మన్ పిచ్చయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మొత్తం 20 మంది సభ్యులకు కేవలం పదిమంది కౌన్సిలర్లు, ఒక కో ఆప్షన్ సభ్యుడు మాత్రమే హాజరయ్యారు. వైకాపాకు చెందిన ఏడుగురు కౌన్సిలర్లు గైర్హాజరయ్యారు. సమావేశంలో గతంలో రూ.15 లక్షల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులు ప్రారంభించక పోవటంతో వాటిని రద్దు చేయటానికి సభ్యులు ఆమోదం తెలిపారు. దర్శి ప్రభుత్వ వైద్యశాల వద్ద రూ.2.5 లక్షల వ్యయంతో కల్వర్టు నిర్మాణానికి, క్రిస్టియన్‌పాలెంలో రూ.3.5 లక్షల వ్యయంతో తాగునీటి ప్లాంట్ ఏర్పాటుకు ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో డీఈ రహీం, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


సమావేశంలో అభివృద్ధి పనులపై చర్చిస్తున్న ఛైర్మన్ పిచ్చయ్య, కమిషనర్ మహేష్ తదితరులు

# స్ఫూర్తి ప్రదాత జాషువా

**కనిగిరి, సి.ఎస్.పురం, దర్శి, న్యూస్‌టుడే:** సమ సమాజ నిర్మాణ స్ఫూర్తి ప్రదాత గుర్రం జాషువా అని ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి కొనియాడారు. కనిగిరి పట్టణంలో శనివారం తెదేపా ఆధ్వర్యంలో గుర్రం జాషువా జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సమాజంలో వివక్షతను, అసమానతలు తన కవిత్వం ద్వారా ఎత్తిచూపిన మహాకవి జాషువా అని పేర్కొన్నారు. ఆయన్ను ప్రతి ఒక్కరు స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. ముందుగా ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వద్ద ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంతో తెదేపా నాయకులు తిరుపతయ్య, మాలకొండయ్య, సుభాని తదితరులు పాల్గొన్నారు. ● ఎస్సీ, ఎస్టీ, బీసీ సంఘాల ఆధ్వర్యంలో గుర్రం జాషువా జయంతిని కనిగిరి పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ● దర్శిలో దళిత సంఘాల ఆధ్వర్యంలో గుర్రం జాషువా జయంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జాషువా చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ● సీఎస్‌పురం మండలంలోని ఉప్పలపాడు మండల పరిషత్తు ప్రాథమికోన్నత పాఠశాలలో గుర్రం జాషువా జయంతిని నిర్వహించారు.


కనిగిరి: జాషువా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి

## సస్యరక్షణ చర్యలు అవసరం

**దర్శి:** జిల్లాలో సాగు చేస్తున్న పంటల్లో సమయానుకూలంగా సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా ఆత్మ డిప్యూటీ పీడీ సుబ్రహ్మణ్యేశ్వరరావు అధికారులను కోరారు. దర్శి వ్యవసాయ పరిశోధనాస్థానం ప్రధాన శాస్త్రవేత్త డా.వరప్రసాదరావు అధ్యక్షతన కేవీకేలో శనివారం శిక్షణ, సందర్శన కార్యక్రమం చేపట్టారు.

## మంత్రిని కలిసిన డీఆర్‌డీఏ పీడీ

**టంగుటూరు:** డీఆర్‌డీఏ పీడీ జి.వి.నాయుడు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామిని మండలంలోని తూర్పు నాయుడుపాలెంలోని ఆయన నివాసంలో శనివారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.



# అధికారుల బాధ్యతల స్వీకరణ

**తాళ్లూరు, దర్శి, సింగరాయకొండ గ్రామీణం, దొనకొండ:** తాళ్లూరు మండల తహసీల్దారుగా కె.రాజ్యలక్ష్మి బాధ్యతలు శనివారం స్వీకరించారు. నెల్లూరు జిల్లా కలెక్టరు కార్యాలయంలో ఏఓగా పని చేస్తున్న ఆమె బదిలీల్లో భాగంగా ఈ ప్రాంతానికి వచ్చారు. ఇక్కడ తహసీల్దారుగా పని చేస్తున్న పి.సింగారావు బాపట్ల జిల్లా జె.పంగులూరు మండలానికి స్థానచలనం పొందారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు, ఇతర సిబ్బంది, వీఆర్వోలు, సర్వేయర్లు ఆమెను కలసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు. ● దర్శి మండల నూతన ఎంపీడీవోగా ఎల్.కృష్ణమూర్తి శనివారం బాధ్యతలు స్వీకరించారు. చిత్తూరు జిల్లా నారాయణవనం మండలంలో విధులు నిర్వహిస్తున్న ఆయన సాధారణ బదిలీల్లో భాగంగా ఈ ప్రాంతానికి వచ్చారు. ● సింగరాయకొండ ఎంపీడీవోగా జయమణి శనివారం బాధ్యతలు చేపట్టారు. ఆమె నాగులుప్పలపాడు మండలం నుంచి సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడకు వచ్చారు.● దొనకొండ మండల పరిషత్ ఎంపీడీవోగా శ్రీదేవి శనివారం బాధ్యతలు స్వీకరించారు.


రాజ్యలక్ష్మి, తహసీల్దారు, తాళ్లూరు,


జయమణి, ఎంపీడీవో, సింగరాయకొండ

## నేడు మెగా వైద్య శిబిరం

**పామూరు, న్యూస్‌టుడే:** ప్రపంచ గుండె దినోత్సవం సందర్భంగా పామూరులోని మల్లిఖార్జునరెడ్డి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు డాక్టర్ పి.మల్లిఖార్జునరెడ్డి తెలిపారు. రోగులకు ఉచిత ఓపీ, ఈసీజీ, 2డి ఎకో, కొలెస్ట్రాల్, షుగర్ పరీక్షలు ఉచితంగా చేస్తారని చెప్పారు. ఈ ఉచిత మెగా వైద్య శిబిరాన్ని రోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## రెండో రోజూ విద్యుత్తు ఉద్యోగుల నిరసన

**కనిగిరి, న్యూస్‌టుడే:** కనిగిరి విద్యుత్తు సబ్ డివిజన్ పరిధిలో జరిగిన అక్రమ బదిలీలను నిలిపేయాలంటూ రెండోరోజైనా శనివారం విద్యుత్తు ఈఈ కార్యాలయం వద్ద భోజన విరామ సమయంలో ఏపీ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ 1104 ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు అనిల్‌కుమార్, హరికృష్ణ, అబ్దుల్ కరీం, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## దేశ భద్రతే ధ్యేయంగా పనిచేస్తున్న ప్రధాని మోదీ

**పామూరు, న్యూస్‌టుడే:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ భద్రతే ధ్యేయంగా పనిచేస్తున్నారని భాజపా నియోజకవర్గ కన్వీనర్ కొండిశెట్టి వెంకటరమణయ్య తెలిపారు. పామూరులోని ఎస్సీ కాలనీ, వగ్గంపల్లి గ్రామంలో శనివారం ఆయన భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పేదలకు అనేక సంక్షేమ పథకాలను కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోందని, రాష్ట్రానికి అధికంగా నిధులను కేటాయిస్తోందని తెలిపారు. పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జేసీ సుబ్బయ్య, పాల్గొన్నారు.

## 1 నుంచి పోలీస్ చట్టం అమలు

**పామూరు, న్యూస్‌టుడే:** పామూరు, సి.ఎస్.పురం మండలాల్లో అక్టోబరు 1 నుంచి 30వ తేదీ వరకు పోలీసు చట్టం అమలులో ఉంటుందని ఎస్సైలు టి.కిషోర్‌బాబు, ఆర్.సుమన్ తెలిపారు. పోలీసుల అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ప్రదర్శనలు నిర్వహించకూడదని చెప్పారు. ఈ చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## గృహనిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసుకోవాలి

**హనుమంతునిపాడు, న్యూస్‌టుడే:** పక్కా గృహనిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసుకోవాలని ఎంపీడీవో రంగసుబ్బారాయుడు లబ్ధిదారులకు సూచించారు. మండలంలోని వేములపాడులో గృహనిర్మాణశాఖ లబ్ధిదారులతో శనివారం ఏర్పాటు చేసిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. నిర్మాణాలు పూర్తిచేసుకుంటే బిల్లులు వెంటనే విడుదల చేస్తామన్నారు.

## బాల్య వివాహాల నియంత్రణపై అవగాహన

**హనుమంతునిపాడు, న్యూస్‌టుడే:** బాలికలకు 18 ఏళ్లు నిండకుండా వివాహం చేయడం చట్టపరంగా నేరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కమలకుమారి తెలిపారు. స్థానిక కేజీబీవీలో శనివారం విద్యార్థినులకు బాల్యవివాహాల నియంత్రణపై అవగాహన కల్పించారు. చిన్న వయసులో వివాహాలు చేస్తే భవిష్యత్తులో వచ్చే అనర్థాలు వివరించారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్స్‌పల్ ఇందిర, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ కార్మికుడికి చేయూత

**సింగరాయకొండ గ్రామీణం, న్యూస్‌టుడే:** సింగరాయకొండ పంచాయతీలో విద్యుత్తు సహాయ కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్న జరుగుమల్లి మండలం కె.బిట్రగుంట చెందిన బాపట్ల మధు గత కొంతకాలంగా కాలేయ సంబంధిత వ్యాధితో మంచానికే పరిమితమయ్యారు. విషయం తెలుసుకున్న సింగరాయకొండ అప్‌డేట్స్ సభ్యులు బాధితుడి ఇంటికెళ్లి రూ.10 వేల ఆర్థిక సాయం శనివారం అందజేశారు.

# ఇరుకు దారిలో రాలేం.. పోలేం..!

**పామూరు, న్యూస్‌టుడే:** పామూరులోని నెల్లూరు రహదారి రవి కలామందిర్ థియేటర్ సమీపం నుంచి 565 జాతీయ రహదారి వరకు ఉన్న ఒక్క వరుస దారిని విస్తరించకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఈ రోడ్డులో నెల్లూరు, కడప, తిరుపతి, చెన్నై, బెంగళూరుకు వాహనదారులు వెళ్తుండడంతో నిత్యం రద్దీగా ఉంటుంది. ఒకే వరుస దారి కావడంతో ఎదురుగా వాహనాలు వచ్చినప్పుడు తప్పుకొనేందుకు, రహదారి దిగేటప్పుడు ముఖ్యంగా ద్విచక్రవాహన చోదకులు పడరాని పాట్లు పడుతున్నారు. కొందరు అదుపుతప్పి కింద పడి మృత్యువాత పడిన సంఘటనలు ఉన్నాయి. కొద్దిపాటి వర్షం కురిసినా రహదారిపై పలుచోట్ల వర్షపు నీరు నిలిచి తటాకాన్ని తలపిస్తోంది. అందులో నుంచి బస్సులు, లారీలు, కార్లు ఇతర పెద్ద వాహనాలు వెళ్లినప్పుడు రహదారి పక్కన వెళ్లే వారిపై బురద చిమ్ముతుంది. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి రెండు వరుసల అభివృద్ధిగా చేసి ప్రమాదాలు జరగకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై ఆర్‌అండ్ బీ ఏఈఈ షేక్ ఫిరోజ్ వివరణ కోరగా.. నెల్లూరు రహదారిలో 1.3 కిలోమీటర్లు మేర సీసీ రహదారిని రెండు వరుసల రహదారిగా అభివృద్ధి చేసేందుకు, ఇరువైపులా డ్రైనేజీల నిర్మాణానికి రూ.4.63కోట్లు నిధులతో అంచనాలను రూపొందించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు.


నెల్లూరు రోడ్డులో హెచ్‌పీ పెట్రోల్ బంకు ముందు ప్రధాన రహదారిపై నిలిచిన వర్షపునీరు

## బాధితుడికి ఆర్థిక సాయం అందజేత

**సి.ఎస్.పురం, న్యూస్‌టుడే:** మండలంలోని కోవిలంపాడు గ్రామానికి చెందిన డోలా తిరుపతినారాయణ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. విషయం తెలుసుకున్న తెదేపా నాయకుడు షేక్ నాయబ్‌రసూల్, ఒంగోలు పార్లమెంట్ తెలుగు యువత అధికార ప్రతినిధి షేక్ రజ్జబ్ బాషాలు బాధితుడికి ఇంటికి చేరుకుని రూ.20 వేల నగదును ఆర్థిక సాయంగా శనివారం అందజేశారు.

## ఎరువుల దుకాణాల తనిఖీ

**తూర్పుగంగవరం(తాళ్లూరు):** క్రిమి కీటకాలు, తెగుళ్ల నియంత్రణకు సకాలంలో సరైన మందులను అవసరమైన మోతాదు ప్రకారం వినియోగించాలని జిల్లా వనరుల కేంద్రం డిప్యూటీ ప్రాజెక్టు డైరెక్టరు సుబ్రహ్మణ్యం, డీడీఏ రామ్మోహన్‌లు తెలిపారు. మండలంలోని తూర్పు గంగవరం, సోమవరప్పాడు గ్రామాల్లో క్షేత్రస్థాయి పర్యటనల్లో భాగంగా శనివారం వరి, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. అనంతరం తూర్పుగంగవరంలోని పలు విత్తనాలు, ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. నిల్వల రిజిస్టర్లతోపాటు విక్రయాలకు సంబంధించిన బిల్లు పుస్తకాలను పరిశీలించారు. కార్యక్రమంలో దర్శి కేవీకే శాస్త్రవేత్త డాక్టరు కె.రమేష్, దర్శి ఏడీఏ కె.బాలాజీనాయక్, రమేష్, ఏఓలు బి.ప్రసాదరావు, శేషమ్మ, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.


ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

## వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

**తాళ్లూరు, న్యూస్‌టుడే:** మండలానికి ఓ వివాహిత అదృశ్యమైన సంఘటనపై శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. శుక్రవారం ఉదయం మహిళ ఇంటిలో ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయింది. ఆమె ఆచూకీ కోసం ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో ఆమె భర్త పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎస్.మల్లిఖార్జునరావు తెలిపారు.

## ఆర్టీసీ బస్సు ఢీ కొట్టి.. ఇద్దరికి గాయాలు

**కనిగిరి:** ట్రాక్టరును ఆర్టీసీ బస్సు ఢీ కొట్టిన ప్రమాదంలో ఇద్దరికీ స్వల్ప గాయాలయ్యాయి. ఈ సంఘటన కనిగిరి మున్సిపాలిటీ పరిధిలో ఆదర్శ పాఠశాల రోడ్డులో శనివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని పునుగోడు నుంచి కనిగిరికి వస్తున్న ట్రాక్టర్‌ను అదే మార్గంలో వస్తున్న ఆర్టీసీ బస్సు మోడల్ స్కూల్ సమీపంలో అధిగమించబోయి వెనుక భాగంలో ఢీ కొట్టింది. దీంతో ట్రాక్టర్ ఒక్కసారిగా బోల్తా పడి.. చోదకుడు పెద్దిరాజు, పక్కనే కూర్చున్న పెద్ద ఓబులేసులకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

# గోకులం.. ఉపాధికి అవకాశం

● పశుపోషకుల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం పెద్దపీట

పామూరు, న్యూస్‌టుడే:

గ్రామీణ ప్రాంత ప్రజలు వ్యవసాయం తరువాత అతి ఎక్కువగా ఆధారపడ్డ రంగం పాడి పరిశ్రమ. అలాంటి రంగం అభివృద్ధికి కూటమి ప్రభుత్వం సంకల్పించింది. వీలైనంత మంది పశుపోషకాలకు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు కృషి చేస్తోంది. పశువుల నివాసానికి షెడ్లు ఏర్పాటు చేసుకునేందుకు గోకులం పేరుతో ప్రత్యేక పథకాన్ని అమలు చేస్తోంది. గతంలో తెదేపా ప్రభుత్వ హయాంలో ఎంతోమంది అర్హులైన లబ్ధిదారులు ఈ పథకం ద్వారా ప్రయోజనం పొందారు. అనంతరం అధికారంలోకి వచ్చాక వైకాపా ప్రభుత్వం అయిదేళ్లూ పథకాన్ని అటకెక్కించింది. ఇటీవల మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గోకులం లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ మొదలు పెట్టేందుకు దరఖాస్తుల స్వీకరించి చర్యలు చేపట్టింది.

### అర్హతలు ఇవి..

ప్రభుత్వం గోకులం పథకం కింద షెడ్ల రాయితీలు అందిస్తోంది. పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్ల పెంపకందారులకు ఈ అవకాశం కల్పిస్తుంది. ఇందులో పశువుల పెంపకందారులకు 90 శాతం, గొర్రెలు, మేకలు, కోళ్ల పెంపకందారులకు 70 శాతం చొప్పున రాయితీలు కల్పిస్తున్నట్లు పశువైద్యాధికారులు చెబుతున్నారు. పశువులు, జీవాలు, కోళ్లు ఉండి ఉపాధి హామీ పథకంలో జాబ్ కార్డు ఉన్న చిన్న, సన్నకారు రైతులు ఈ పథకానికి అర్హులు. షెడ్డు ఏర్పాటు చేసుకోవాలని భావించేవారికి కొద్దిపాటి స్థలం ఉంటే చాలు. సంబంధిత దరఖాస్తులు రైతు సేవా కేంద్రం, మండల వ్యవసాయశాఖ కార్యాలయం, పశువైద్యశాలల్లో అందుబాటులో ఉంటాయి. పూర్తిచేసిన దరఖాస్తు ఫారంతో పాటు ఆధార్ కార్డు, జాబ్ కార్డు, షెడ్ల నిర్మాణం చేపట్టే భూమి హక్కు పత్రాలు, బ్యాంకు పాసు పుస్తకం, నకలు జత చేయాలి. కనిగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాలకు మండలానికి 50 చొప్పున 300 గోకులం యూనిట్లను ప్రభుత్వం మంజూరు చేసింది.


తెదేపా ప్రభుత్వంలో నిర్మించిన గోకులం షెడ్డు

### రైతులకు ఈ పథకం ఎంతో ఉపయుక్తం

ప్రభుత్వం రైతులకు మంజూరు చేసిన గోకులం షెడ్లు పథకం ఎంతో ఉపయుక్తం. పశువులు, జీవాలు షెడ్డు వసతి లేకపోవడం వల్ల అవి అనారోగ్యం బారిన పడే అవకాశం ఉంది. అర్హులైన వారు ఈ పథకాన్ని వీటిని సద్వినియోగం చేసుకోవాలి. - డాక్టర్ ఆర్.రమేష్, పశుసంవర్థకశాఖ సహాయ సంచాలకులు, సి.ఎస్..పురం.

## హిందువుల మనోభావాలు దెబ్బతీసిన వైకాపా

**సింగరాయకొండ గ్రామీణం, న్యూస్‌టుడే:** ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ చేస్తున్న 11 రోజుల ప్రాయశ్చిత దీక్షకు మద్దతుగా మండలంలోని పాత సింగరాయకొండ నరసింహస్వామి ఆలయ మెట్లకు మండల జనసేన నాయకులు శనివారం సంప్రోక్షణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మనోజ్‌కుమార్ మాట్లాడుతూ.. గత వైకాపా ప్రభుత్వం హిందువుల మనోభావాలు దెబ్బతీసిందని మండిపడ్డారు. ముందుగా జనసేన వీర మహిళలు, కార్యకర్తలు పసుపు నీళ్లతో మెట్లు శుద్ధి చేసి పసుపు కుంకుమలతో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పార్టీ సింగరాయకొండ, జరుగుమల్లి మండల అధ్యక్షులు రాజేష్, శశిభూషణ్, తదితరులు పాల్గొన్నారు.


నరసింహస్వామి ఆలయ మెట్లు శుద్ధి చేస్తున్న జనసేన నేతలు

## 'ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చేందుకే ఆరోపణలు'

**టంగుటూరు, న్యూస్‌టుడే:** ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే తిరుపతి లడ్డూపై తెదేపా నేతలు ఆరోపణలు చేస్తున్నారని మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ విమర్శించారు. టంగుటూరు పోలేరమ్మ ఆలయంలో శనివారం ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ.. తెదేపా నేతలకు ఏమాత్రం చిత్తశుద్ధిఉన్నా.. చేసిన ఆరోపణలు నిరూపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైకాపా నాయకులు బొట్ల రామారావు, పుట్టా వెంకటరావు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ బలోపేతానికి కృషి

**పామూరు:** పార్టీ బలోపేతానికి నాయకులంతా కృషి చేయాలని సీపీఐ జిల్లా మాజీ కార్యదర్శి ఎం.వెంకయ్య తెలిపారు. స్థానిక డీవీ మనోహర్ భవనంలో నిర్వహిస్తున్న పార్టీ జిల్లా శిక్షణా తరగతుల్లో భాగంగా రెండో రోజు శనివారం కమ్యూనిస్టు- చరిత్ర- నిర్మాణం అంశంపై ఆయన ఉపన్యాసించారు. పార్టీ ప్రచారం- ఆందోళన- పద్ధతులు- మెలకువలు గురించి డీవీవీఎస్ వర్మ బోధించారు. భారతదేశ చరిత్ర సంస్కృతి- నిజమైన నాగరికత అంశంపై బీఎన్ సాగర్ వివరించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీపీఐ నేత కార్యదర్శి వెంకయ్య

## పీవీఆర్ చౌదరి మృతి కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటు

**టంగుటూరు, న్యూస్‌టుడే:** పీవీఆర్ చౌదరి మృతి కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటని సీపీఎంఎల్ జిల్లా కార్యదర్శి దావలూరి నరసింహస్వామి పేర్కొన్నారు. మండలంలోని పొందూరు గ్రామంలో పీవీఆర్ చౌదరి సంతాప సభ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనతో ఉన్న అనుబంధాలు నేతలు పంచుకున్నారు. సీపీఐ సీనియర్ నాయకులు ఉప్పుటూరి ప్రకాష్‌రావు, బాలకృష్ణ, వెంకటేశ్వర్లు, కొండారెడ్డి, నరసింహం తదితరులు పాల్గొన్నారు.

## గుంటిగంగలో జడ్పీ ఛైర్ పర్సన్ పూజలు

**తూర్పుగంగవరం(తాళ్లూరు):** మండలంలోని గుంటిగంగలో కొలువుదీరిన గంగా భవాని అమ్మవారి ఆలయంలో శనివారం జడ్పీ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ ప్రత్యేక పూజలు చేశారు. తిరుమల లడ్డూ ప్రసాదంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేస్తున్న ప్రచారాన్ని ప్రక్షాళన చేయాలని, తిరుమల లడ్డూ ప్రాముఖ్యత భక్తుల్లో నమ్మకం కలిగించేందుకు పూజా కార్యక్రమాలు చేపట్టారు. మాజీ ఎంపీపీ మధు, మోషే, మండల వైకాపా నాయకులు సుబ్బారెడ్డి, ఇంద్రసేనారెడ్డి, యలమందారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


గుంటిగంగలోని ఆలయం వద్ద వైకాపా నేతలతో కలిసి జడ్పీ ఛైర్‌పర్సన్ వెంకాయమ్మ

# ఒంగోలు

•ఒంగోలు •సంతనూతలపాడు

## నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యుత్తు మరమ్మతుల దృష్ట్యా ఒంగోలు నగర పరిధిలోని మంగమూరురోడ్డు, మర్రిచెట్టు కాలనీ, ప్రగతినగర్ తదితర ప్రాంతాల్లో ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈఈ కేవీ.పాండు రంగారావు తెలిపారు.



## మంత్రిని కలిసిన డీఆర్‌డీఏ పీడీ

టంగుటూరు, న్యూస్‌టుడే: డీఆర్‌డీఏ పీడీ జి.వి.నారాయణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామిని మండలంలోని తూర్పు నాయుడుపాలెంలోని ఆయన నివాసంలో శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించారు.

# ఆహార వీధి.. పదండి తిందాం మరి

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే

◆ నగరంతో ప్రారంభమైన మొదటి ఫుడ్ స్ట్రీట్

తెదేపా ప్రభుత్వం వచ్చాక నగరంలో అభివృద్ధి కార్యక్రమాలు ఊపందుకున్నాయి. నగరం కొత్త శోభ సంతరించుకుంటుంది. ఇప్పటికే సుందరీకరణ పనులు ప్రారంభమయ్యాయి. అభివృద్ధి చెందిన నగరాల మాదిరిగా ఒంగోలులో కూడా ఫుడ్ కోర్టులు ఏర్పాటుచేయడానికి అధికారులు అంతా సిద్ధం చేసుకున్నారు. ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ సూచన మేరకు కమిషనర్ కె.వెంకటేశ్వరరావు దీనికోసం ఒక ప్రణాళిక రూపొందించారు. ప్రధాన రహదారుల వెంట జన సంచారం అధికంగా ఉన్న ప్రదేశాల్లో ఫుడ్ స్ట్రీట్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. వీధుల్లో, ప్రధాన రహదారుల పక్కన మొబైల్ ఆహారశాలలు ఏర్పాటు చేయడంవల్ల ట్రాఫిక్ సమస్యలు మరింత తీవ్రమవుతుంది. పడేసే వ్యర్థాల వల్ల పారిశుద్ధ్య సమస్య తలెత్తుతోంది. దీంతో ఆహార ప్రియులకు ఎక్కడ ఏమున్నాయో తెలుసుకోవడం కష్టంగా ఉంది. ఈసందర్భంగా విక్రయదారులకు నిర్దేశ స్థలం కేటాయించాలని కమిషనర్ నిర్ణయించారు. అక్కడ తగిన పార్కింగ్, లైటింగ్ ఏర్పాటు చేస్తే వినియోగదారులకు సౌకర్యంగా ఉండటంతోపాటు, రహదారుల వెంట పరిశుభ్రత ఉంటుందని భావిస్తున్నారు.

### మూడు చోట్లకు సన్నాహాలు

ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ నగరపాలక సంస్థ అధికారులతో కలిసి స్వయంగా కొన్ని ప్రదేశాలను పరిశీలించారు. ముందుగా రంగారాయుడు చెరువు పక్కన, పీవీఆర్ స్కూలు ఎదుట ఉన్న స్థలంలో 32 స్టాల్స్ ఏర్పాటు చేయనున్నారు. దీనికోసం అక్కడ స్థలం చదునుచేసి సిద్ధం చేశారు. ఇదే విధంగా పాత కూరగాయల మార్కెట్ సెంటర్, పాత బైపాస్‌రోడ్డులో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు మూల మలుపులో ఉన్న స్థలాన్ని పరిశీలించారు. ముందుగా రంగారాయుడి చెరువు దగ్గర శనివారం ప్రారంభించగా మిగిలినవి నెల రోజుల్లో ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. వినియోగదారులు వాహనాలు నిలిపినప్పుడు ట్రాఫిక్‌కు ఇబ్బంది కలగకుండా చూడాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు.



పీవీఆర్ బాలుర ఉన్నతపాఠశాల ఎదుట ఫుడ్‌స్ట్రీట్‌కు సిద్ధం చేస్తున్న స్థలం



ఫుడ్‌స్ట్రీట్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దామచర్ల

### అట్టహాసంగా...

నగరంలో మొదటి ఫుడ్‌స్ట్రీట్‌ను శనివారం రాత్రి ప్రారంభించారు. ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ స్వయంగా స్థలం ఎంపిక చేసి ఏర్పాట్లను పరిశీలించారు. సాయంత్రం కమిషనర్ కె.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో డివిజన్ పరిధిలోని వీధి విక్రయదారులను పిలిపించి డ్రా పద్ధతిలో వ్యాపార స్థలం కేటాయించారు. మేయర్ సుజాత విక్రయాలు ప్రారంభించారు. డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణ, తేదేపా, జనసేన కార్పొరేటర్లు పాల్గొన్నారు. పానీ పూరి, చికెన్ పకోడీ, చాట్ మసాలా, ఇతర అల్పాహార విక్రయశాలలు ఏర్పాటు చేశారు.



కార్యక్రమంలో మేయర్, కమిషనర్, కార్పొరేటర్లు

## నైపుణ్యాభివృద్ధి కేంద్రం పునఃప్రారంభానికి చర్యలు

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: గత ఐదేళ్లుగా మూతపడిన నైపుణ్యాభివృద్ధి కేంద్రాన్ని మళ్లీ ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటామని కమిషనర్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. శనివారం ఆయన నెహ్రూనగర్‌లో పర్యటించారు. ఐదేళ్ల క్రితం ఈనాడులో నైపుణ్యాభివృద్ధి కేంద్రం గురించి కథనం ప్రచురితమైన నేపథ్యంలో ఆయన కేంద్ర భవనాన్ని పరిశీలించారు. అనంతరం నేతాజీకాలనీలో పర్యటించారు. అక్కడి నివాసాలకు ఇంటి పన్నులు వేయాలని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించారు. వెంకటేశ్వరకాలనీలో ఆక్రమించి చేపట్టిన నిర్మాణాన్ని తొలగించాలని టౌన్‌ప్లానింగ్ సిబ్బందికి సూచించారు. కమిషనర్‌తోపాటు ఇంజినీర్లు, శానిటరీ అధికారులు ఉన్నారు.



నెహ్రూనగర్‌లోని నైపుణ్యాభివృద్ధి కేంద్రం వద్ద వివరాలు తెలుసుకుంటున్న కమిషనర్

## సమాజ అభివృద్ధికి విద్యార్థులు దోహదపడాలి

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతోపాటు సమాజ అభివృద్ధికి దోహదపడాలని ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం సహాయ ఆచార్యుడు హర్షప్రీతం దేవ్‌కుమార్ సూచించారు. శనివారం ఒంగోలులోని మాదాల నారాయణస్వామి భవన్‌లో పీడీఎస్‌యూ జిల్లా సాధారణ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రపంచ చరిత్రను పరిశీలిస్తే అన్ని రంగాల్లో విద్యార్థులే సహజ వనరులను ఉపయోగించుకుని ముందుకు వెళ్తున్నట్లు వివరించారు. సమావేశంలో పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.రాజశేఖర్ నాయకులు ఎం.రాఘవ రావు, పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.పద్మ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సహాయ ప్రొఫెసర్ హర్షప్రీతం దేవ్‌కుమార్

## ఓటర్ల జాబితా పరిశీలనలో అప్రమత్తత అవసరం

సంతనూతలపాడు, న్యూస్‌టుడే: తప్పులు లేని ఓటర్ల జాబితాలను సిద్ధం చేయాలని ఈఆర్వో వరకుమార్ పేర్కొన్నారు. శనివారం ఒంగోలులో సంతనూతలపాడు నియోజకవర్గ స్థాయిలో బీఎల్వోలు, సూపర్‌వైజర్లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. తప్పుల పరిశీలనలో అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో నియోజక వర్గ ఎన్నికల ఉప తహసీల్దార్ శీలం శ్రీనివాసరావు, నాలుగు మండలాల బీఎల్వోలు పాల్గొన్నారు.

## గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

రుద్రవరం(సంతనూతలపాడు), న్యూస్‌టుడే: గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని తహసీల్దార్ వి.ఆదిలక్ష్మి పేర్కొన్నారు. శనివారం మండలంలోని రుద్రవరంలో గృహ నిర్మాణ లబ్ధిదారులతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. గ్రామంలో 36 గృహాలకు గాను 10 మంది మాత్రమే ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేశారన్నారు. వీరందరూ రానున్న ఏడాది మార్చి 31లోపు పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు కూకట్ల శరత్, మన్నం సుబ్బారావు, సర్పంచి ఓరుగంటి బలరామిరెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.





## కుక్కలకు టీకాలు తప్పనిసరి

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: పెంపుడు కుక్కలకు యాంటీ రేబీస్ టీకాలు వేయించాలని జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారిణి బేబిరాణి సూచించారు. ప్రపంచ స్థానిక సంతపేటలోని జిల్లా పశువైద్యశాల ఆవరణలో శనివారం రేబిస్ దినోత్సవం సందర్భంగా పెంపుడు కుక్కలకు టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. టీకా వలన కలిగే లాభాలు, వాటి పోషణ గురించి వివరించారు. కార్యక్రమంలో బహుళార్థ పశువైద్యశాల డీడీ జగత్ శ్రీనివాస్, పశువైద్యాధికారులు పాల్గొన్నారు.

## సీడ్ బాల్స్‌తో పర్యావరణానికి మేలు

నాగులుప్పలపాడు, న్యూస్‌టుడే: సీడ్ బాల్స్‌తో పర్యావరణానికి ఎంతో మేలు చేకూరుతుందని వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ కొంజెటి సురేష్‌బాబు అన్నారు. శనివారం ఉప్పుగుండూరులో వాసవీక్లబ్ ఆధ్వర్యంలో మోస్ట్ సీడ్ బాల్స్ మేకింగ్ అండ్ కలెక్షన్ డ్రైవ్‌ను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. 12 వేల సీడ్ బాల్స్‌ను తయారు చేసి, వివిధ పాఠశాలలకు అందజేశామన్నారు. ఆ సీడ్ బాల్స్‌ను అక్టోబరు 2వ తేదిన మహాత్మగాంధీ జయంతి రోజున గ్రామంలోని వివిధ ప్రాంతాల్లో విసిరి వేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వాసవీక్లబ్ సభ్యులు అమరా వేణు, పులకణం రాజేష్, నూకల దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

## చెరువు అభివృద్ధిపై వినతి

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: నగరంలోని ఊరచెరువును అభివృద్ధి చేయాలని కోరుతూ సీపీఎం నగర నాయకులు శనివారం కమిషనర్ కె.వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నగర కార్యదర్శి జి.రమేష్, నాయకులు నరసింహారావు, కె.విశ్వసేన్, భక్త సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## చీమకుర్తిలో 'స్వచ్ఛతా హీ సేవా' ర్యాలీ

చీమకుర్తి, న్యూస్‌టుడే: చీమకుర్తిలో జాతీయ సేవా విభాగం ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛతా హీ సేవా ర్యాలీ నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రత, పచ్చదనం పెంపుదల తదితర అంశాలకు సంబంధించిన నినాదాలు చేస్తూ విద్యార్థులు ర్యాలీలో పాల్గొన్నారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాల నుంచి పట్టణంలోని వివిధ మార్గాల్లో ర్యాలీ సాగింది. ఏన్వో కోటపాటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.





ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులు

## ప్లాస్టిక్ వినియోగానికి వ్యతిరేకంగా ప్రదర్శన

ఒంగోలు నగరం: ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణాన్ని కాపాడండి అంటూ స్థానిక సాయి బాబా సెంట్రల్ స్కూలు విద్యార్థులు కళారూపాలు ప్రదర్శించారు. శనివారం పాఠశాల అకడమిక్ డైరెక్టర్ సాయినాథుని శృతి నేతృత్వంలో నిర్వహించిన కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి. విద్యార్థులు అయిదు బృందాలుగా ఏర్పడి ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే దుష్ఫలితాలను కళ్లకు కట్టినట్లు వివరించారు. నృత్యాలు, లఘు నాటికలు ప్రదర్శించారు. చిన్నతనం నుంచే పర్యావరణంపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామని డైరెక్టర్ తెలియజేశారు.



ప్రదర్శన ఇస్తున్న విద్యార్థులు

## భగత్ సింగ్ యువతకు ఆదర్శం

చీమకుర్తి, న్యూస్‌టుడే: దేశం కోసం ప్రాణత్యాగం చేసిన భగత్ సింగ్‌లాంటి వ్యక్తులను నేటి విద్యార్థులు, యువత ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా ఎస్ఎఫ్ఐ ఉపాధ్యక్షులు జి.దేవరాజు కోరారు. చీమకుర్తిలోని పంగులూరి కృష్ణయ్య భవనంలో శనివారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. డి.వాసుబాబు, ప్రవీణ్, పుష్పరాజ్, తేజ, అభిరామ్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: త్వరలో పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి స్కిప్పింగ్ పోటీలకు ఒంగోలు మండలం ముక్తినూతలపాడు గ్రామ జడ్పీ ఉన్నత పాఠశాల ఏడో తరగతి విద్యార్థులు టి.ప్రసన్న, ఎస్.చైతన్య ఎంపికయ్యారు. విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు దేవసేన, పీఈటీ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

● చీమకుర్తి, న్యూస్‌టుడే: చీమకుర్తి మండలం దేవరపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన డి.వెంకట లక్ష్మీ, సీహెచ్.సృజన, డి.కిశోర్‌లు రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ జట్టుకి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు భాస్కర శాస్త్రి తెలిపారు. స్వర్ణాంధ్రప్రదేశ్ 2049 మండల స్థాయి వ్యాసరచన పోటీల్లో పాఠశాలకు చెందిన చరతి, నీలిమలు మండల స్థాయిలో ప్రథమ, తృతీయ స్థానాల్లో నిలిచినట్లు ఆయన చెప్పారు.

● నాగులుప్పలపాడు, న్యూస్‌టుడే: నాగులుప్పలపాడు మండలంలోని వివిధ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు స్వర్ణాంధ్ర-2047 పోటీలను విద్యాశాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. వ్యాసరచన పోటీల్లో నాగులుప్పలపాడు ఉన్నత పాఠశాల విద్యార్థి పి.కృష్ణ చైతన్య ప్రథమ స్థానంలో నిలవగా ఉప్పుగుండూరు జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థిని జి.శ్వేత ద్వితీయ స్థానం కైవసం చేసుకొంది.



ఎంపికైన విద్యార్థులతో వ్యాయామ ఉపాధ్యాయులు

## మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM) ఒంగోలు నగరం: 8008574067
ఒంగోలు గ్రామీణం : 8008564455
ఒంగోలు అంజయ్య రోడ్డు : 8247324766
ఎస్.ఎన్.పాడు: 8008552692

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలను, చిత్రాలను వాట్సాప్ ద్వారా పంపవచ్చు. లేదా ఫోన్లో వివరించవచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

మద్దిపాడు, న్యూస్‌టుడే:

సమస్య: మండలంలోని అన్నంగి గ్రామంలో కుక్కల బెడద ఎక్కువగా ఉంటుంది. చిన్న పిల్లలను వృద్ధులను ఇబ్బందులకు గురవుతున్నారు. వారం రోజుల వ్యవధిలో ముగ్గురు పిల్లలను గాయపరిచాయి. కుక్కల సమస్య తీర్చండి.
–కుంచాల ఆంజి బాబు అన్నంగి

సమాధానం: కుక్కల సమస్యకు తగు చర్యలు తీసుకుంటాం.
–అనూష, కార్యదర్శి

ఒంగోలు కర్నూలు రోడ్డు, న్యూస్‌టుడే:

సమస్య: కొత్తపట్నం మండలం కె.పల్లెపాలెం గ్రామంలో డ్రైనేజీ పారడంలేదు. చిన్నపాటి వర్షం పడినా నీరు నిలిచి రోడ్డు మీదకు వస్తున్నాయి. వర్షం పడినప్పుడు ఇంటి నుంచి బయటకు రావాలంటే ఇబ్బందిగా ఉంటుంది. సమస్య లేకుండా చూడాలని కోరుతున్నాం. – గొల్లపోతు శివ, స్థానికుడు

సమాధానం: సమస్యను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం. – తూపాకులు మణిదీప్, కార్యదర్శి

సమస్య: కొత్తపట్నంలో పలు రోడ్డులో వీధిలో కుక్కలు ఎక్కువగా ఉన్నాయి. రాత్రి వేళ్ల ఇంటి నుంచి బయటకు వచ్చినప్పుడు పైన పడి భయాందోళనకు గురి చేస్తున్నాయి.
– సుధీర్ బాబు

సమాధానం: అధికారులతో మాట్లాడి కుక్కల సమస్య లేకుండా చూస్తాం. – సునీత కార్యదర్శి

## విద్యుత్తు దీపాలు ఏర్పాటు

స్పందనకు వందనం

ఒంగోలు అంజయ్యరోడ్డు, న్యూస్‌టుడే: నగరంలోని కొత్తపట్నం వైపు వెళ్లే రైల్వే వంతెన, కొప్పోలు వరకు విభాగిని మధ్యలో ఏర్పాటు చేసిన విద్యుత్తు దీపాలు వెలగడం లేదు. అనే అంశం పై 'ఈనాడు'లో 'మేమున్నాం మీకు తోడుగా' లో ఈ నెల 26న ప్రచురితమైన అంశానికి అధికారులు స్పందించారు. కొత్త విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేశారు.

## కాసారం అమర్చారు

నాగులుప్పలపాడు, న్యూస్‌టుడే: ఈదుమూడి ఎస్సీ కాలనీలో విద్యుత్తు స్తంభంపై తీగలను కట్టె కాసారం(ఇనుప రాడ్డు) దెబ్బతిందని ఈనాడు 'మేమున్నాం.. మీకు తోడుగా' లో శనివారం ప్రచురితమైంది. దీనిపై విద్యుత్తు శాఖ ఇన్‌ఛార్జి ఏఈ రమేష్ స్పందించారు. సిబ్బంది వెంకటేష్, అశోక్‌లచే స్తంభంపై నూతన క్రాసారం ఏర్పాటు చేయించారు. సమస్య పరిష్కారం కావడంతో కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేశారు.



## కలెక్టర్ ఈవీఎం గోదాం పరిశీలన

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: ఒంగోలు భాగ్యనగర్‌లోని ఈవీఎం గోదాములను కలెక్టర్ తమీమ్ అన్సారియా శనివారం పరిశీలించారు. పలు రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో గోదాము తెరిచి అందులోని ఈవీఎంలను పరిశీలించారు. ప్రాంగణంలో కల్పిస్తున్న భద్రతపై ఆరా తీశారు.



ఈవీఎం పరిశీలిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, నాయకులు

## 30న ఒప్పంద కార్మికుల సమస్యలపై ధర్నా

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: ఒప్పంద కార్మికుల సమస్యలపై ఈ నెల 30న స్థానిక కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.శ్రీనివాసులు తెలిపారు. ఏపీఎస్‌ఆర్టీసీలో పనిచేస్తున్న ఒప్పంద, పొరుగు సేవల కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ప్రతి నెలా 7వ తేదీలోపు జీతాలు చెల్లించి, రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ధర్నాకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు.

## ఏకేయూ స్పోర్ట్స్ బోర్డు సభ్యుడి నియామకం

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: కడప జిల్లా యోగి వేమన విశ్వవిద్యాలయం ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్పోర్ట్స్ బోర్డు ఎక్స్‌పర్ట్ మెంబర్‌గా ఏకేయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం డిప్యూటీ డైరెక్టర్ ఐ.దేవీ వరప్రసాద్ నియమితులయ్యారు. అక్టోబర్ ఒకటోతేదీన ఉపకులపతి కె.కృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగే ప్రత్యేక సమావేశానికి హాజరుకావాలని కోరారు. ఈ బోర్డు ద్వారా క్రీడా ప్రణాళిక, అంతర్ విశ్వవిద్యాలయాల క్రీడలపై చర్చించి నిర్ణయాలు తీసుకుంటారన్నారు.

● సహాచార్యులకు పదోన్నతి : ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: స్థానిక ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న ఇరువురు అసోసియేట్ ప్రొఫెసర్లకు ఆచార్యులుగా పదోన్నతి లభించింది. వైస్ ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్న ఎన్.నిర్మలామణి, డీన్ డాక్టర్ జి.సోమశేఖరలకు పదోన్నతి లభించింది. ఈ మేరకు నాగార్జున విశ్వవిద్యాలయం ప్యానెల్ కమిటీలో ఆమోదం లభించింది. ఏకేయూలో వివిధ విభాగాల్లో పనిచేస్తూ పదోన్నతి పొందిన వారిని ఉపకులపతి మూర్తి, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

# గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషి

చీమకుర్తి, : గిరిజనులకు సంబంధించి భూమి తదితర సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారం దిశగా తగిన చర్యలు చేపడతామని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాతోతు హుస్సేన్ తెలిపారు. గిరిజన గురుకులాల్లో చదువుతున్న విద్యార్థుల్లో ఆంగ్ల భాషా నైపుణ్యాలు పెంపొందింప చేయాలని ఆయన కోరారు. చీమకుర్తి గిరిజన సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలను శనివారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాల ఆవరణలో జరుగుతున్న నూతన భవన నిర్మాణాలను ఆయన పరిశీలించారు. జిల్లా గిరిజన అధికారి జగన్నాథం, సహాయ అధికారి సుబ్బయ్య, ప్రిన్సిపల్ ఎం.ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పట్టాలిచ్చారే కానీ ఇళ్లు ఇవ్వలేదు : కొత్తపట్నం : కొత్తపట్నం మండలం చింతల వద్ద నక్కల కాలనీను హుస్సేన్ సందర్శించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 2008లో 55 కుటుంబాలకు పట్టాలు ఇవ్వడం జరిగింది, కానీ మాకు పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వలేదని నక్కల కాలనీవాసులు ఆయన ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం రంగాయపాలెంలో పర్యటించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఒంగోలు ఆర్డీవో సుబ్బారెడ్డి, జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి జగన్నాథరావు, నగర కమిషనర్ వెంకటేశ్వరరావు, భాజపా జిల్లా అధ్యక్షుడు పీవీ.శివారెడ్డి, తహసీల్దార్లు వాసు, మధుసూదనరావు ఉన్నారు.



విద్యార్థులతో ముచ్చటిస్తున్న కేంద్ర ఎస్టీ కమిషన్ సభ్యులు జాతోతు హుస్సేన్

## ఘనంగా జాషువా జయంతి

సంతనూతలపాడు, న్యూస్‌టుడే: సాహిత్యంతో సామాజిక పీడల విముక్తికి కృషి చేసిన మహోన్నత వ్యక్తి, కవి సామ్రాట్ గుర్రం జాషువా అని సమాజ సేవకులు, బహుజన కవి అట్లూరి రామారావు పేర్కొన్నారు. శనివారం ఎండ్లూరులో గుర్రం జాషువా జయంతి వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో బహుజన కవి అన్నంగి సుబ్బారావు, న్యాయవాది అట్లూరి రాఘవులు, ఉపాధ్యాయ సంఘ నాయకులు అమ్మయ్య, అట్లూరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చీమకుర్తి, న్యూస్‌టుడే: కవి కోకిల గుర్రం జాషువా జయంతి వేడుకలను చీమకుర్తి క్రిష్టియన్‌పాలెంలో నిర్వహించారు. కౌన్సిలర్ పాటిబండ్ల గంగయ్య, పాటిబండ్ల రాజ సులోచన, శారద, దానం, బాబూరావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



గుర్రం జాషువా చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న రామారావు తదితరులు

## ఆలయాల్లో వైకాపా నాయకుల పూజలు

ఒంగోలు, న్యూస్‌టుడే: ఒంగోలు సంతపేటలోని సాయిబాబా ఆలయంలో మాజీ ఎమ్మెల్యే, వైకాపా పార్లమెంటు నియోజకవర్గ పరిశీలకుడు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరుమల శ్రీవారి లడ్డూ వివాదంలో మాజీ సీఎం జగన్ సర్కార్‌పై విమర్శల నేపథ్యంలో వాటిని తిప్పికొడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలకు ఆ పార్టీ పిలుపునిచ్చింది.. ఈ మేరకు పూజలు నిర్వహించి మీడియాతో మాట్లాడుతూ.. తిరుమల లడ్డూపై అసత్య ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో నగర కమిటీ అధ్యక్షుడు కఠారి శంకర్, నాయకులు కె.వి.రమణారెడ్డి, వై.వెకంటేశ్వరరావు పాల్గొన్నారు. ● మద్దిపాడు: మద్దిపాడు మండల పార్టీ అధ్యక్షుడు అప్పారావు ఆధ్వర్యంలో మల్లవరంలో ప్రసన్న వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించామన్నారు. రాష్ట్ర మాజీ మంత్రి ఎస్.ఎన్.పాడు నియోజకవర్గ సమన్వయకర్త నాగార్జున కార్యక్రమంలో పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తదితరులు